# గురు శిష్యుల బంధం

## ఆధ్యాత్మిక చైతన్యం - మేల్కొలుపు

కదంబ కానన స్వామి



# గురు శిష్యుల బంధం

## ఆధ్యాత్మిక చైతన్యం - మేల్కొలుపు

కదంబ కానన స్వామి

గురు శిష్యుల బంధం
ఆధ్యాత్మిక చైతన్యం - మేల్కొలుపు

కదంబ కానన స్వామి

Email: info@kadambafoundation.com
Website: kadambafoundation.com

కృష్ణ కృపా మూర్తి శ్రీ శ్రీమద్ ఏ.సి.భక్తివేదాంతస్వామి శ్రీల ప్రభుపాదుల
పుస్తకాలు, ఉపన్యాసాలు, లేఖలు మరియు సంభాషణల నుండి సంగ్రహణ.

© 2018 భక్తివేదాంత బుక్ ట్రస్ట్ ఇంటర్నేషనల్
వారి అనుమతితో పైవి వినియోగింపబడ్డాయి.

కాపీరైట్ © 2023 కదంబ ఫౌండేషన్ - ఆమ్స్టర్డామ్, నెదర్లాండ్స్
ISBN 978-80-904652-6-8

# అంకితం



శ్రీల ప్రభుపాదుల సంతోషమునకై, నేను సదా సర్వదా కృతజ్ఞుడను.

# విషయ సూచిక

**అంకితం**.....5

**ప్రభుపాద**.....10

మనలను రక్షించు కృప!.....11

ప్రభుపాదుల పుస్తకాలను అధ్యయనం చేయడం.....11

ప్రభుపాదుల బోధనల అంతరార్థం.....12

ఆధ్యాత్మిక నియమాలను అనుసరించడం.....12

ఆధ్యాత్మిక గురువు యొక్క అవసరం.....13

గురు-శిష్యుల బంధానికి సంబంధించిన అంశాలు.....14

ఎప్పుడూ తాజాగా ఉంటాయి.....14

కృష్ణ భగవానుడే కేంద్ర బిందువు.....14

గురువు మన సామర్థ్యాన్ని నిరూపిస్తారు.....15

అమృత ఫలముల నిధి......15

సాక్షాత్కారం ద్వారా సాధించవలసిది.....15

అవ్యక్త సూచనలు.....15

ఒక ముఖ్యమైన చింతన.....16

అతి గొప్ప నిధి.....16

వెలకట్టలేని క్షణాలు.....16

గొప్ప ఆశీర్వాదాలు.....16

చిన్న చిన్న విషయాలకై గురువు శరణు పొందుట.....16

ఎనలేని ప్రయత్నం.....17

శిష్యుని పవిత్రత.....17

గురువు యొక్క మానసిక స్థితిని అనుసరించడం.....17

మనం గురువు యొక్క ఆస్తి!.....18

స్ఫూర్తి ప్రదాత.....18

గురువు మన గొప్ప శ్రేయోభిలాషి.....18

గురువు భగవంతునికి శిష్యునకు మధ్యవర్తి.....19

ఒక క్లిష్టమైన బంధం.....19

హృదయ పరివర్తన ....................................................................................19
ఒక అవినాభావ సంబంధం ........................................................................20
దృఢమైన స్నేహం ..................................................................................20
శిష్యుని చొరవ ......................................................................................20
శిష్యుడి అంకితభావం..............................................................................20
గురువు ఒక్కడే .....................................................................................21
గురువు కృష్ణుడితో అవినాభావ సంబంధం కలిగి ఉంటాడు...................................21
ఇది కృష్ణుని పాదాల చెంత స్థిరపడిన బంధం ..................................................21

**గురువుకు కృష్ణుడితో ప్రత్యేక సంబంధం ఉంటుంది** ..........................................22
బలమైన వ్యక్తులు ..................................................................................22
ఒక కుటుంబ స్ఫూర్తి .............................................................................. 24
కృష్ణ భగవానుని పరమ ప్రధానంగా భావించుట ................................................27
భక్తి యుత సేవ పట్ల అంకితభావం ..............................................................28

**ఒక ప్రత్యేక అభ్యర్థన** .............................................................................29

**కదంబ కానన స్వామి గురించి** ......................................................................32

# పరిచయం

మనలో ప్రతి ఒక్కరం పరిపూర్ణ సంబంధాల కోసమై పరితపిస్తున్నాము. అందువల్లనే ఈ భౌతిక ప్రపంచంలోని వ్యక్తులతో, ఇక్కడి ఆస్తిపాస్తులతో లోతైన బంధాల కోసమని పరుగెడుతున్నాము. ఈ లౌకిక బంధాలే మనకు ఆనందాన్ని చేకూర్చగలవని గుడ్డిగా నమ్ముతున్నాము. కానీ గమనించవలసిన విషయం ఏమిటంటే, ఈ బంధాలు తాత్కాలికమైనవి, వాస్తవానికి ఇవి చివరకు బాధలకే దారితీస్తాయి. మరోవైపు నిజమైన సంబంధాలనేవి శాశ్వతంగా నిలిచిపోయేవి, ఆ శాశ్వత బంధాలే మనం ఇంతలా వాంఛిస్తున్న అకుంఠిత ఆనందాన్ని ప్రసాదిస్తాయి. మన గురించి నిజంగా శ్రద్ధ వహించే వారు, మనం వంచన లేని సంబంధాలు కలిగి ఉండి, పూర్తి సంతోషంతో ఉండాలని కోరుకుంటారు. అంతే కాక తాత్కాలిక సంబంధాల నుండి మనం పొందగల 'మిడిమిడి సంతోషం' నుండి మనలను కాపాడతారు.

ఆధ్యాత్మిక గురువు, పరమ సత్యమైన దేవదేవునితో మనలను అనుసంధానం చేయగల ఏకైక వ్యక్తి అగుటచే ఆయనే మన అతి గొప్ప శ్రేయోభిలాషి, ఎందుచేతనంటే గురువు భగవంతుని మరియు గురు శిష్య పరంపర యొక్క ఉత్తమ సేవకుడు. ఆ కారణాన, మనం ఈ శరీరం కాదు, ఆత్మ స్వరూపులమనే వాస్తవ జ్ఞానమునొసగి, మనలను ఆధ్యాత్మిక మార్గంలో స్థిర పరచడమే వారి పరమ కర్తవ్యం.



ఈ ప్రయాణ క్రమంలో, మన అసంఖ్యాక ముసుగులు తొలగిపోయి మన ప్రామాణికమైన, సంతోషకరమైన వాస్తవం తెరపైకి వస్తుంది. కాబట్టి గురువు మనం నిజానికి ఎవరమనే వాస్తవాన్ని మనకు వెల్లడించడమే కాకుండా, భౌతిక ప్రపంచంలో మరియు వెలుపల, మన ప్రయాణంలో శాశ్వతంగా మనకు తోడై ఉంటారు.

ఆధ్యాత్మిక గురువుతో మొదలయ్యే ప్రయాణం శిష్యులకు ఆధ్యాత్మికత పట్ల ఎంతో ఉత్తేజాన్ని కలిగిస్తుంది. ఈ బంధం పోను పోను గొప్పగా రూపాంతరం చెందుతుంది. గురువు సూచనలను అనుసరించడం ద్వారా, శిష్యుని ఆధ్యాత్మిక దృష్టి మేల్కొంటుంది మరియు అతను ఇంతకు ముందు ఊహించని అవకాశాల ప్రపంచం అతని ముందు వెల్లడి అవుతుంది.

శాస్త్రంలో క్రింది విధంగా చెప్పబడింది:

*ఓం అజ్ఞాన-తిమిరాంధస్య*

*జ్ఞానాంజనా-శలాకయా*

*చక్షురున్మిలితం యేన*

*తస్మై శ్రీ గురవే నమః*

"అజ్ఞానం అనే అంధకారంలో ఉన్న నా కనులను జ్ఞాన జ్యోతితో తెరిపించిన నా ఆధ్యాత్మిక గురువునకు నా గౌరవ-ప్రదమైన ప్రణామములు.“

గౌతమీయ-తంత్ర

[సేకరణ: శ్రీమద్-భాగవతం 8.1.11 భాష్యం నుండి]

# శ్రీల ప్రభుపాద

## మనలను రక్షించు కృష్ణ కృపా మూర్తి

శ్రీల ప్రభుపాదులు ఈ హరేకృష్ణ సంకీర్తనోద్యమం (ఇస్కాన్) యొక్క వ్యవస్థాపక ఆచార్యులు. ఆ ప్రకారంగా, ఈ ఉద్యమంలోని సభ్యులందరికీ వారే ప్రథమ గురువు. మనలో కొంతమంది శ్రీల ప్రభుపాదుల శిష్యులకు సేవ చేయడం ద్వారా శ్రీల ప్రభుపాదులతో సంబంధాన్ని కలిగి ఉండే గొప్ప అవకాశం మన వద్ద ఉంది, వారి శిష్యులకు సేవ చేయడమంటే, శ్రీల ప్రభుపాదులకే స్వయంగా సేవ చేసినట్లు లెక్క, శ్రీల ప్రభుపాదులు నియమించిన వైష్ణవులకు సేవ చేస్తూ, తద్వారా శ్రీల ప్రభుపాదులతో మన సంబంధాన్ని మరింతగా బలపరుచుకోవడానికి ఇదొక సువర్ణ అవకాశం.

ప్రభుపాదుల గురించి మాట్లాడుతూ, ఒకరు బ్రహ్మానంద ప్రభువుని ఇలా అడిగారు, "ఉద్యమపు తొలిరోజుల్లో మీరు ప్రభుపాదులతో గడిపిన రోజులు అత్యంత సన్నిహితమైనవి, తరువాత ఈ ఉద్యమం ప్రపంచ వ్యాప్తమైంది. ఉద్యమం ఉధృతమైన తర్వాత ప్రభుపాదులతో మీకు గల సంబంధంలో ఏదైనా మార్పు వచ్చిందని మీరు భావిస్తున్నారా?"

అప్పుడు బ్రహ్మానంద ప్రభు ఇలా సమాధానమిచ్చారు, "సరే, మీరు చిన్న పిల్లాడిగా ఉన్నప్పటికీ, మరియు ఇప్పుడు మీరు పెరిగి పెద్దవారయ్యాక, మీకు మీ తండ్రి గారికి మధ్య సంభందం ఏమైనా మారిందా? ఏమీ మారలేదు కదా. ఇది కూడా అలాగే!"

అప్పుడు పరిచయ కర్త ఇలా అన్నాడు, "మీరు శ్రీల ప్రభుపాదులను దేవునిగా అంగీకరించినట్లు నేను భావిస్తున్నాను!" దానికి బ్రహ్మానంద ప్రభు, "అరెరె, అది పొరపాటు! 1970లో ప్రభుపాదులే దేవుడని భావించి ఆ తప్పు చేశాను. ప్రభుపాద దేవుడు కాదు - ఆయన దేవుడంత మంచివాడు! కానీ ఈ రోజుల్లో, ప్రభుపాద దేవుని కంటే గొప్పవాడని నేను భావిస్తున్నాను, ఎందుకంటే అతను నన్ను రక్షించడానికి పాశ్చాత్య ప్రపంచం వైపునకు వచ్చారు! " అలా అన్న తర్వాత ఇక బ్రహ్మానంద ప్రభు తన్నుకు వస్తున్న తన కన్నీటిని ఆపుకోలేకపోయారు!

అద్భుతం కదా. అది ఖచ్చితంగా నా హృదయాన్ని కదిలించిన విషయం! నాలో నేననుకున్నాను, "నిజమే కదా! చివరికి మనందరి స్థానం అదే."

అసలు విషయమేమిటంటే, శ్రీల ప్రభుపాదుల అపరిమితమైన కరుణ కారణంగానే మనం ఇక్కడ కలవగలిగాము. ఇంద్రియాలకు బానిసలై, కలియుగ అంధకారంలో సతమతమవుతున్న మనందరికీ స్వచ్ఛమైన ప్రేమను పరిచయం చేయడానికి, ప్రభుపాదులు అత్యున్నత, పరమ పావనమైన ఆధ్యాత్మిక లోకం నుండి వచ్చారు. ఆ ప్రపంచం ఎట్టిదంటే, అక్కడ భగవంతుడు తన అందమైన త్రిభంగ రూపంలో, నెమలి ఈకలతో, కలువ కన్నులతో, అపరిమిత అద్భుతమైన లక్షణాలతో దర్శనమిస్తాడు. అట్టి అద్భుత గుణ గణాలు గల దేవదేవుని, ఎవరైనా స్వయంగా, ఉన్నది ఉన్నట్టుగా ఎలా అర్థం చేసుకోగలరు?

ప్రభుపాదులు స్వచ్ఛమైన మనసు గలవారు; నిక్కచ్చి మనిషి. వారు శుద్ధ భక్తితో భగవంతుని ప్రేమించారు. ప్రభుపాదులు ప్రత్యక్షంగా కృష్ణ భగవానుని చూడగలిగారు. ప్రభుపాదులు, "భగవంతుడు నీలం రంగులో ఉంటారు"

అని ప్రకటించినందున, భగవంతుని రంగు నీలమని మనం నిస్సందేహంగా అంగీకరించవచ్చు! వారి దయచే ఇది అర్థం చేసుకోవడం మనకు చాలా సులభం! ప్రభుపాదులు కృష్ణ చైతన్య ఉద్యమపు సజీవ రుజువు, ఈ ప్రక్రియ ఎంత గొప్పగా పనిచేస్తుందో చెప్పడానికి వారి జీవితమే ఒక నిలువుటద్దం. ప్రభుపాదులు మనకు స్ఫూర్తి ప్రదాత మరియు విశ్వాసానికి మూలం మాత్రమే కాదు, మనల్ని ఓడను ఒడ్డు వద్ద పట్టి ఉంచే లంగరు వంటి వారు. మనకు సందేహం వచ్చినప్పుడల్లా, ప్రభుపాదులు మనలను కాపాడే లంగరు వంటి వారు అని గుర్తుంచుకోవాలి. మన వ్యక్తిగత స్వభావం ఉధృతమై, సాగర అలలపై స్వారీ చేస్తున్నప్పుడు మనం వారి దయ పైననే ఆధారపడి ఉండాలని గుర్తుంచుకోవాలి.

మనం ఎప్పుడైనా తిరిగి శరణు పొందగల సురక్షితమైన, విశాల హృదయం కలిగినట్టి భూమాత అంతటి ఓర్పు కలిగిన మహనీయులు వారు. అటువంటి ఉన్నత వ్యక్తిత్వం కోసం, వారి బోధనల కోసం మనం ఆయనను విశ్వసిస్తాము. వారి బోధనలను అనుసరించిన చాలు, మనకున్న అన్ని సందేహాలను నివృత్తి చేసుకోగలమన్న విషయం మనకు తెలుసు; మన కృష్ణ చైతన్యానికి కావలసిన ఆధారాన్ని వారి యందు మనం కనుగొంటాము. వారి దయ వలన మనం కృష్ణుడితో సురక్షితమైన అనుబంధాన్ని పదిల పరుచుకోగలము. మనం ప్రభుపాదులతో నిరంతర సంబంధాన్ని ఏర్పరచుకొను మార్గాలు మన చెంత కలవు - ఎలానంటే, వారు తయారు చేసిన భక్తులలో మనం వారిని చూడవచ్చు, వారి పుస్తకాలలో వారిని దర్శించవచ్చు, వారి సూచనలలో వారి మార్గదర్శనాన్ని అనుసరించవచ్చు.

ప్రభుపాదులు మనకు కావాల్సిన ప్రతిదీ మనకిచ్చారు - జీవించడానికి ఒక సన్మార్గం, పూర్తి చేయడానికి ఒక సేవ, నెరవేర్చడానికి ఒక లక్ష్యం. వైరం మరియు వంచనతో నిండిన ఈ ప్రస్తుత యుగంలో ప్రపంచం ఎలా ఉంటుందో తెలిపి, అందు మన కర్తవ్యం ఏమిటో కూడా వారు మనకు మార్గదర్శనం చేశారు.

కాబట్టి శ్రీల ప్రభుపాదులు వాస్తవానికి ఎవరు, వారు ఏమి కోరుకున్నారు, ఏమి చెప్పారు , నిజంగా ఏమి ఇష్టపడతారు అనే దాని గురించి మరింత ఎక్కువగా తెలుసుకోవాల్సిన బాధ్యత మన పైన ఉన్నది. ఇది కూడా శ్రీల ప్రభుపాదులకు మన పై గల దయనే!

ప్రేమ అంటే మన ఆలోచనలను, ఇష్టాలను ప్రేమించిన వారి కోసం పక్కన పెట్టడం. మనం ఎవరినైనా ప్రేమిస్తున్నప్పుడు, మన స్వంత స్వభావాన్ని పక్కన పెట్టి, ఆ వ్యక్తిని సంతోషపెట్టడానికి ప్రయత్నించాలి, అతను లేదా ఆమె కోరుకున్నట్లుగా మసులుకోవాలి. కాబట్టి, ప్రభుపాదుల పై మనకు నిజంగా ప్రేమ ఉంటే, మన స్వంత స్వభావాన్ని పక్కన పెట్టి, వారు చూపిన మార్గాన్ని స్వీకరించడానికి మనం ఎంతవరకు సిద్ధంగా ఉన్నాం అనే విషయం పై దృష్టి సారించాలి.

## ప్రభుపాదుల పుస్తకాలను అధ్యయనం చేయడం

మనం శ్రీల ప్రభుపాదుల పుస్తకాలను నిరంతరం చదవుతూ ఉండాలి. వాటి సారాంశాన్ని అర్థం చేసుకుని, క్షుణ్ణంగా అధ్యయనం చేయాలి.

ప్రభుపాదుల పుస్తకాలు మన జీవితంలో ప్రధానమైన భాగం. ఈ రోజుల్లో ఎన్నో పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఎంతో మంది పుస్తకాలు రాశారు. ఎన్నో పుస్తకాలు విశ్వ వ్యాప్తమై మన అవగాహనను పెంచాయి. అయినప్పటికీ,

భగవద్గీత, భక్తి రసామృత సింధువు, శ్రీమద్-భాగవతం మరియు చైతన్య-చరితామృత అనే ఈ నాలుగు ప్రధాన పుస్తకాలు అన్నం, పప్పు, కూర మరియు చపాతీల వంటివి. ఇతర పుస్తకాలు పచ్చడి వంటివి.

మీకు తెలుసు, పచ్చడి కొన్ని సార్లు నంజుకోవడానికి బాగుంటుంది. పచ్చడి కొత్తగా, విభిన్నమైన రుచి కలిగి ఆసక్తికరంగా ఉంటుంది. కానీ ప్రాథమికంగా మన ప్రధాన ఆహారం అన్నం, పప్పు, కూర మరియు చపాతీ. కేవలం పచ్చడి మాత్రమే తింటానంటే, ఆరోగ్యానికి అదంత మంచిది కాదు!

మనం శ్రీల ప్రభుపాదుల పుస్తకాలు మరియు వ్యాసాలను చదవడం ప్రారంభించినప్పుడు, మనకు ఒక లాంటి ఉపశమనం కలుగుతుంది. వారి ప్రతి పదం ఒక దీవెన, ప్రతి పదం సర్వ మంగళం, ప్రతి పదం శుభకరం! ప్రభుపాద భాగవతంలో మనకు నచ్చనిది ఏదైనా ఉందీ అనంటే, అది భాగవతంలో ఉన్న దోషం కాదు. దాని అర్థం మనలోనే ఏదో అశుభం ఉందని. భాగవతం అమల పురాణం - మచ్చలేని పురాణం. మరియు శ్రీల ప్రభుపాదులు పొందుపర్చిన భాష్యాలు, శ్లోక అనువాదాల కంటే కూడా చాలా ముఖ్యమైనవి. ఎందుకంటే ఆ భాష్యాల వల్లనే మనం శ్లోకం యొక్క నిజమైన అర్థాన్ని గ్రహించగలం. కాబట్టి ఈ అద్భుతమైన పుస్తకాలే మనకు ఆశ్రయం అవ్వాలి, అవే మనకు భౌతిక బాధల నుండి ఉపశమనాన్ని కలిగించగలవు. వాటిలో మనం లోతుగా నిమగ్నమైపోవాలి.

శ్రీల ప్రభుపాదులు వారి శిష్యులందరినీ తన పుస్తకాలను ముద్రించడం, ప్రచురించడం మరియు పంపిణీ చేయడంలో తనకు సహాయం చేయవలసిందిగా అభ్యర్థించారు, తద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న తత్వవేత్తలు, పండితులు, మతవాదులు మరియు ప్రజలు ఈ కృష్ణ చైతన్య ఆధ్యాత్మిక సాహిత్యాన్ని చదవడం ద్వారా ప్రయోజనం పొందుతారు. ప్రతి చోటా చాలా మంది ప్రజలు ఏదో రకంగా ఆధ్యాత్మికత కోసం తహతహలాడుతూ, జీవితపు పరమార్థాన్ని వెతుకుతున్నారు. కేవలం ఒక భక్తుడు మాత్రమే ఒకరి జీవితంలోకి ఒక పుస్తక రూపంలో అడుగు పెట్టడం ద్వారా, ఆ వ్యక్తి యొక్క విధిని పూర్తిగా మార్చివేయగలడు. కేవలం ఒకే ఒక్క పుస్తకం ఒకరి జీవితంలో ఇంత పెద్ద మార్పుని తీసుకురాగలదు!

## ప్రభుపాదుల బోధనల అంతరార్థం

మనం ఒక మహోన్నత భక్తుడైన శ్రీల ప్రభుపాదులచే శిక్షణ పొందుతూ ఉన్నాము. వారు మనలను క్రమంగా, ఒక పద్ధతి ప్రకారం దేవదేవుడైన శ్రీకృష్ణ భగవానునికి అంకితమై, నిస్వార్థ భక్తియుత సేవనొనర్చు దిశగా మనలను నడిపిస్తున్నారు.

మనం భగవంతుని అడగవలసిన ఏకైక ఆశీర్వాదం: "ప్రభూ! దయచేసి మీ ఆరాధన సేవ నుండి నన్ను ఎప్పటికీ దూరం చేయవద్దు", అని! మరేదైనా కోరిక కోరడానికి మనం సేవ చేయకూడదు;

సేవయే పరమోన్నతమైనది, మహత్తరమైనది. మనకు కావలసింది భక్తి యుత సేవ మాత్రమే. మనకు వేరే ఏదో కావాలి కాబట్టి మనం పూజించము. కాదు, మన జీవితంలో ఉత్తమమైనది కృష్ణునికి చేసే ఈ సేవ మాత్రమే. ఇదే శ్రీల ప్రభుపాదులు మనకు బోధిస్తున్నది.

అంతేగాక, శ్రీల ప్రభుపాదులు భగవంతుని యొక్క పవిత్ర నామాలను కీర్తించు హరే కృష్ణ మహా మంత్ర జప ప్రక్రియను అత్యంత సులభమైనదనీ మరియు అత్యంత ప్రయోజనకరమైన సేవయనీ నొక్కి చెప్పారు. శ్రీ కృష్ణ భగవానుని

పవిత్ర నామాన్ని జపించడం - మనల్ని జనన మరణాల నుండి విముక్తి చేయడమే కాకుండా, భగవత్ప్రేమ అను అత్యున్నత అనుభవాన్ని మనకు ప్రధానం చేస్తుంది.

## ఆధ్యాత్మిక నియమాలను అనుసరించడం

ప్రభుపాదుల సహ శిష్యులైన ఒకరు మార్క్విస్ ఆఫ్ జెట్‌లాండ్‌తో చర్చిస్తూ ఉన్న సందర్భమది. జెట్లాండ్ నేను బ్రాహ్మణునిగా మారుటకు అవకాశం కలదా అని అడిగాడు,. అవతలి నుంచి "అవును తప్పకుండా!" అని సమాధానం వచ్చింది. "చేయవలసిందల్లా మీరు అక్రమ సంభోగం, మాంసాహారం, మత్తు పదార్థాల సేవనం మరియు జూదం వంటి పాప కర్మలను వదిలివేయడమే." అని సెలవిచ్చారు.

"అసాధ్యం!" మార్క్విస్ బదులిచ్చారు.

ప్రభుపాదుల వారికి ఇది గుర్తుకు వచ్చినప్పుడల్లా, తమలో తామే అనుకునేవారు, "అసాధ్యమా... అయినా సరే, నేను ఒక్క సారి పాశ్చాత్యులను మార్చడానికి ఎలాగైనా ప్రయత్నించాలి!" అని. కృష్ణుడు, గురువు మరియు పవిత్ర నామం పై వారికి గల ధృడ విశ్వాసం, అకుంఠిత దీక్ష అంతటి అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేసింది.

ప్రభుపాదుల వారు ఆధ్యాత్మిక జీవితాన్ని ట్రాఫిక్ రోడ్డుతో పోల్చేవారు. అది నాకు బాగా నచ్చింది. ఎలాగంటే, మన ఆధ్యాత్మిక జీవిత ప్రారంభ దశ, రాత్రిపూట చీకట్లో ప్రయాణం చేసే కారు డ్రైవర్ వంటిది. ఈ దశలో మన దృష్టి పూర్తిగా రహదారిపై ఉండే తెల్లటి గీతల పైనే ఉంచుతాం. ఆ తీక్షణ దృష్టే మనలను రోడ్డు ప్రమాదాల నుంచి కాపాడే ట్రాఫిక్ నిబంధనల వంటిది. అలాగే మనం పాటించే ఆధ్యాత్మిక నియమాలు కూడా మనల్ని ఆధ్యాత్మిక పథం నుంచి దారి తప్పకుండా ఉండడానికి సహాయపడతాయి.

అదే పగటి సమయంలో మనము డ్రైవింగ్ చేస్తున్నప్పుడు, సూర్య కాంతి ప్రభావం వలన రోడ్డు పై ఉండే ఆ తెల్లటి గీతలను మాత్రమే కాకుండా చుట్టూ ఉండే ప్రకృతి, పరిసరాలు, పర్వతాలు, నదులు మరియు చెట్ల వంటి అనేక విషయాలను గమనిస్తాము. అదేవిధంగా, కాలక్రమేణా మన కృష్ణ చైతన్యం వృద్ధి చెందిన కొలది, మనం కృష్ణుడి యొక్క లక్షణాలు, నామ మహిమ, కీర్తి మరియు గుణగణాల గురించి ఎక్కువగా ఆలోచించడం మొదలు పెడతాము. అప్పుడు కూడా, ఆధ్యాత్మిక నియమాలు అలాగే ఉంటాయి, కానీ వాటిపై మనం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉండదు.

కొన్నిసార్లు ఈ ఆధ్యాత్మిక నియమాలు మనల్ని నిర్బంధించినట్టుగా మనకు అనిపించవచ్చు, కానీ భగవద్గీత వాటిని నిర్బంధ నియమాలుగా కాకుండా, స్వేచ్ఛను ప్రసాదించే సూత్రాలుగా వివరిస్తుంది, ఎందుకంటే ఇవే మనల్ని పాప కర్మల నుండి విముక్తుల్ని చేయగలవు.

శ్రీల ప్రభుపాదుల వారు అనేక సందర్భాలలో ఇలా చెప్పే వారు, "మీరు నాలుగు ఆధ్యాత్మిక నియమాలను అనుసరిస్తూ, ప్రతిరోజూ 16 మాలల జపం చేస్తే చాలు, మీ జీవితాంతమున భగవద్ధామమైన గోలోక బృందావనమునకు తిరిగి వెళ్ళుట ఖాయం. దీనికి నేను హామీ ఇస్తున్నాను!" అని. కాబట్టి మనము శ్రీల ప్రభుపాదుల మాటలపై నమ్మకముంచి ఈ మహోన్నత ఆధ్యాత్మిక పథమున ముందుకు సాగాలి.

## ఆధ్యాత్మిక గురువు అవసరం

ఒకరు, శ్రీల ప్రభుపాదుల వారిని, "ఆధ్యాత్మిక జీవితం కొనసాగించుటకు నిజంగా గురువు అవసరమా?" అని అడిగారు.

అప్పుడు ప్రభుపాదుల వారు అన్నారు: "గురువు లేకుండా మీరు ఏమి చేయగలరు? ప్రతిదానికీ గురువు అవసరం. మీరు వడ్రంగి కావాలంటే, మీరు ఒక నేర్పు గల వడ్రంగి నుంచే నేర్చుకోవాలి. మీరు కారు మెకానిక్ కావాలంటే, మీరు ఒక కారు మెకానిక్ నుండే శిక్షణ పొందాలి, మీరొక విశ్వ విద్యాలయ ఆచార్యులు కావాలంటే, అటువంటి ఒక ఆచార్యుని వద్ద నుంచే శిక్షణ పొందాలి, కాబట్టి దేనికైనా గురువు తప్పనిసరి, ఎవరైనా సరే ఒక గురువు నుంచి నేర్చుకోవాల్సిందే. "గురువు లేని విద్య గ్రుడ్డి విద్య" అని పెద్దల వాక్కు.

ఆధ్యాత్మిక జీవితంలో కూడా అలాగే శిక్షణ పొందాల్సి ఉంటుంది. సొంతంగా ప్రయత్నిస్తే మనం కొంత నేర్చుకోగలమేమో కానీ, నిష్ణాతులం అవ్వలేము. మనకు ప్రావీణ్యం కావాలంటే ఆధ్యాత్మిక గురువును ఆశ్రయించాల్సిందే.

కాబట్టి ఏం చేసైనా సరే, మనం ఆధ్యాత్మిక గురువుతో మన బంధాన్ని స్థిరపరుచుకోవడానికి ప్రయత్నించాలి. ఇదే ఈ ఉద్యమపు అసలు రహస్యం. మొత్తం గౌడీయ వైష్ణవ సంప్రదాయంలో ఇస్కాన్ కు ఒక ప్రత్యేకత ఉంది - అదే గురు నిష్ఠ; అదే ఈ ఉద్యమపు గొప్ప విషయం. దానికి శ్రీల ప్రభుపాదుల వారే ఒక గొప్ప ఉదాహరణ. వారి ఆధ్యాత్మిక గురువగు శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకురుల గౌడీయ మఠ చరిత్రను అధ్యయనం చేస్తే, వారికి రోజువారీ గురు పూజ ఉండేది కాదు; వారు సంవత్సరానికి ఒకసారి మాత్రమే గురు పూజ నిర్వహించేవారు! కానీ శ్రీల ప్రభుపాదుల వారు దీనిని ప్రతిరోజూ జరిగేలా ఏర్పాట్లు చేశారు. మన మొత్తం ఆధ్యాత్మిక జీవితంలో గురు పూజ చాలా ప్రధానమైనది, కాబట్టే శ్రీల ప్రభుపాదుల వారు గురు-శిష్యుల బంధానికి అంత ప్రాధాన్యతనిచ్చారు.

శ్రీల ప్రభుపాదుల వారు తరచుగా అనే వారు: "ఈ అద్భుతం నాకే ఎందుకు జరిగింది? మా గురువుకి చాలా మంది శిష్యులు ఉన్నారు, అందరూ నా కన్నా గొప్ప అర్హతలు కలిగిన వారు! మరి ఈ అద్భుతం నాకే ఎందుకు జరిగింది? ఎందుకంటే మా గురువు గారి ఆజ్ఞను నేను వంద శాతం పాటించాను కాబట్టే ఇది సాధ్యమైందని నేను కచ్చితంగా చెప్పగలను"!

చైతన్య-చరితామృతం గ్రంథ ముగింపు మాటలలో శ్రీల ప్రభుపాదుల వారు, కృష్ణుడు తన సహచరులు మరియు భక్తులందరితో పాటు పరమాత్మ రూపంలో మన హృదయాల్లో కొలువై ఉన్నాడని వ్రాశారు. అదే విధంగా ఆధ్యాత్మిక గురువు కూడా ఎల్లప్పుడూ మన హృదయంలోనే కొలువై మనకు మార్గదర్శనం చేస్తారు.

# గురు-శిష్యుల బంధానికి సంబంధించిన అంశాలు

## ఎప్పుడూ తాజాగా ఉంటాయి

కేవలం సత్కర్మల బలాన మాత్రమే, మనం ఉన్నత ప్రమాణాలను పొందలేము, ఒక శుద్ధ భక్తుని దయతో మాత్రమే అది సాధ్యమవుతుంది. ఆ దయ కోసం ఒకసారి ప్రార్థించి వదిలేయడం కాకుండా; నిరంతరం ప్రయత్నిస్తూ-నే ఉండాలి. మనం నిత్యం ఆధ్యాత్మిక గురువును శరణు వేడాలి, అదే మన జీవితానికి ఏకైక ప్రాతిపదిక అయి ఉండాలి. ప్రతి రోజూ మనం ఆధ్యాత్మిక గురువుకు సేవ చెయ్యడం తోనే మొదలు పెట్టాలి. అది మనం తొలి రోజు నుంచే అలవాటు చేసుకోవాలి, అప్పుడే ఆధ్యాత్మిక గురువుతో మన బంధం ఎప్పుడూ నిత్య నూతనంగా ఉంటుంది, అలా చెయ్యడం వల్ల మనం ఆధ్యాత్మిక జీవితంలో పురోగమిస్తాం. అప్పుడు మనం భగవద్గీతను ఆశ్రయించడం సులభతరమౌతుంది.

కాబట్టి ఆధ్యాత్మిక గురువునకు నమస్కరించడం ద్వారా మన రోజు ప్రారంభం అవ్వాలి. "నేను ఈ రోజుని నా ఆధ్యాత్మిక గురువు సేవ కోసం అర్పించబోతున్నాను" అని మనల్ని మనం గుర్తు చేసుకోవడానికి, మేల్కొన్న వెంటనే మన ప్రణామాలు అర్పించాలి. మరలా రోజు చివరిలో, "గురుదేవా! నన్ను క్షమించండి. నేను ఈ రోజు మీకు సరిగా సేవ చేసుకోలేకపోయాను. కానీ రేపు నా సేవని మెరుగుపరచుకోవడానికి ప్రయత్నిస్తాను" అన్న అంకిత భావం ఉండాలి.

## అన్నింటికీ కృష్ణుడే కేంద్ర బిందువు

శ్రీ కృష్ణ భగవానుని దయ వలన మాత్రమే మనం గురువును పొందగలమని మరియు గురువు ద్వారానే కృష్ణుని చేరగలమని, ఈ రెండూ అంతర్గతంగా ముడి పడి ఉన్నాయని శాస్త్ర మందు చెప్పబడింది. ఆ సంబంధంలో కృష్ణుడు ప్రత్యక్ష సాక్షిగా ఉన్నాడు. అందువల్ల ఆ సంబంధాన్ని ఎప్పుడూ మనం సాధారణంగా తీసుకోకూడదు; ఏది జరిగినా అది మన శాశ్వత ప్రయోజనం కోసమే జరుగుతుందని అర్థం చేసుకోవాలి.

దీక్ష సమయంలో, మనం ఇంకా భౌతిక విషయాల పట్ల కొంత అనురక్తులమై ఉంటాము, కానీ ముందటిలా వాటికి అత్యధిక ప్రాధాన్యత ఉండదు. ఎందుకంటే ఇప్పుడు ఆత్మ సంతృప్తికి ప్రాధాన్యతనిస్తాము. ఈ పరిస్థితి కాలక్రమేణా మెరుగవుతూ ఉంటుంది!. కాబట్టి దీక్ష అంటే మన జీవితంలో సరియైన మార్పులకు నాంది పలికే దశ.

దీక్ష తీసుకోవడం అంటే శిష్యుడు తన జీవితాన్ని ఆధ్యాత్మిక గురువుకు పూర్తిగా సమర్పించినట్టు, ఆ పై ఆధ్యాత్మిక గురువు శిష్యుడికి పునర్జన్మను ప్రసాదించినట్టు. అప్పుడు ఆయన మనకు చెప్పే ఒక్క మాట ఏంటంటే "ఇది నేను నీకు ప్రసాదించిన వరం కాబట్టి, ఈ నూతన జీవితాన్ని సద్వినియోగం చేసుకో".

అన్ని గ్రంథాలలో, గురువు కృష్ణుని ప్రతినిధి అని చెప్పబడింది. గురువు అనే మాధ్యమం ద్వారా మాత్రమే కృష్ణుడు మనకు ముక్తిని ప్రసాదించగలడు. అంటే కానీ గురువు దయ లేకుండా అది సాధ్యపడదు. అంతిమంగా, దయను ప్రసాదించేవాడు ఆ దేవదేవుడగు శ్రీ కృష్ణ భగవానుడు మాత్రమే.

శ్రీల ప్రభుపాదులు మొత్తం ప్రపంచాన్ని కృష్ణ చైతన్య మయం చేయడానికి శక్తిని ప్రసాదించమని కృష్ణుని ప్రార్థించే వారు. వారు కేవలం, పదహారు మాలలు జపిస్తూ, నాలుగు ఆధ్యాత్మిక నియమాలను పాటించమని మాత్రమే మనల్ని అడిగారు. ఈ సాధన ద్వారా మనం ఆధ్యాత్మిక ప్రపంచానికి వెళ్ళే ఒక సులభ మార్గాన్ని ప్రభుపాదులు మన కోసం రూపొందించారు. ఈ 'పదహారు మాలల ఆఫర్' కృష్ణుని చేరుటకు అత్యంత సులభమైన మార్గం, శ్రీల ప్రభుపాదులు మన కోసం ప్రత్యేకంగా భగవంతుని ప్రార్థించడం వల్లనే కృష్ణుడు ఆ అభ్యర్థనను ఆమోదించాడు.

## గురువు మన సామర్థ్యాన్ని నిరూపిస్తారు

శ్రీల ప్రభుపాదుల శిష్యులైన సత్ స్వరూప మహారాజు ఒకసారి వారితో ఇలా అన్నారు, "గురు దేవా! నేను ఎటువంటి అర్హత లేని వాడిని, నేను కేవలం ఒక అల్పజ్ఞుణ్ణి... నా వల్ల ఏమీ కాదు!"

దానికి బదులుగా ప్రభుపాదులు ఇలా అన్నారు, "అవును, నువ్వు పనికి రావు. కానీ అది నువ్వు అనుకున్నట్టు కాదు! నువ్వు కేవలం గొప్ప పనులకు మాత్రమే పనికి వస్తావు, అనవసరమైన చిన్న చిన్న కార్యాలు నీకు సరిపడవు". ఆ విధంగా ఆధ్యాత్మిక గురువు మనలో దాగి ఉన్న అసలు సామర్థ్యాన్ని బయటకు తెచ్చి మన శక్తిని బయట ప్రపంచానికి నిరూపిస్తారు. ఆపై మనం ఊహించిన దానికంటే ఎక్కువగా భక్తి మార్గమున పురోగమిస్తాము.!

## అమృత ఫలముల నిధి

ఒక వ్యక్తి తత్వశాస్త్రంలో ప్రవీణుడు అయి ఉండవచ్చు, విషయాన్ని ఎంతో నైపుణ్యంతో వివరించగల వ్యాఖ్యాత అయి ఉండవచ్చును. అతను అంత సాధించినప్పటికీ, అతని హృదయమందు మాత్రం ఎటువంటి శాంతి ఉండక పోవటానికి అవకాశం కలదు. ఎందుకంటే మన ఇంద్రియాలు చాలా బలమైనవి, అంత నేర్చుకున్న తర్వాత కూడా మనిషి ఇంద్రియాలను అదుపు చేయలేక, అవస్థ పడుతూనే ఉంటాడు. కానీ ఎవరైతే ఆధ్యాత్మిక గురువును ఆశ్రయిస్తారో, వారు మాత్రం గురువు సూచనలను హృదయంలో బలంగా నింపుకొని సునాయాసంగా ఇంద్రియాలను నిగ్రహించుకోగలరు. నిజానికి అలా చేసినప్పుడే మనకు అసలైన శాంతి లభిస్తుంది.

## సాక్షాత్కారం ద్వారా సాధించవలసిది

ఈ ఆధ్యాత్మిక జ్ఞానాన్ని వ్యక్తిగత సాక్షాత్కారం ద్వారానే అలవరచుకోవాలని పెద్దల వాక్కు. మొదట ఆధ్యాత్మిక జ్ఞానం పైన అవగాహన రావాలి, తర్వాత దానిని ఆచరణలో పెట్టగలగాలి. అది ఎప్పుడైతే ఆధ్యాత్మిక గురువు యొక్క ఆశ్రయం పొంది ఆ గురువు చెప్పే మార్గం మరియు సూచనలను పాటిస్తామో అపుడు వరిస్తుంది. ఆధ్యాత్మిక జ్ఞానం దానంతట అదే మనల్ని వరిస్తుందని మనం ఎన్నడూ ఆశించవద్దు. దాని కోసం తీవ్రంగా కృషి చెయ్యాలి. శోధించి సాధించాలి. ఎప్పుడైనా సందేహంగా ఉన్నప్పుడు, వెంటనే ఆధ్యాత్మిక గురువును ఆశ్రయించాలి. శ్రీ చైతన్య మహా-

ప్రభు పవిత్ర హరి నామాన్ని జపిస్తున్నప్పుడు, అతను తన ఆధ్యాత్మిక గురువు ముందుకు వచ్చి అన్నారు, “గురుదేవ! మీరు నాకు ఏమి మంత్రం ఇచ్చారు? ఈ హరే కృష్ణ కీర్తన నన్ను పిచ్చివాడిని చేసేసింది!

అది వినగానే మహాప్రభు యొక్క ఆధ్యాత్మిక గురువు గొప్ప ఆనందంతో అరవసాగారు , “అద్భుతం! అద్భుతం! అద్భుతం! నువ్వు ఎంత అదృష్టవంతుడివి! నువ్వు ఎంతో అదృష్టవంతుడివి! ఇలా జరగడం చాలా చాలా అరుదు, చాలా అరుదు. ఇదే నిజానికి ఈ హరే కృష్ణ జపం యొక్క లక్ష్యం, ఇది మిమ్మల్ని పిచ్చివానిగా చేస్తుంది. ఇక్కడ గమనించవలసిన విషయమేమిటంటే, శ్రీ చైతన్య మహాప్రభు, శిష్యుడిగా, ఆధ్యాత్మిక గురువును ఎలా ఆశ్రయిస్తున్నారు గురు మార్గదర్శనాన్ని ఎలా అడుగుతున్నారు అని; మహాప్రభూ కేవలం సూచనల కోసం వేచి ఉండటం లేదు, వాటిని చురుకుగా అర్థిస్తూ, పాటిస్తూ ఉన్నారు.

## అవ్యక్త సూచనలు

కొన్నిసార్లు, మన ఆధ్యాత్మిక గురువు ప్రత్యేకంగా ఎలాంటి సూచనలు కానీ లేదా ఎలాంటి ప్రత్యేకమైన విషయాలు చెప్పడం లేదు అని మకు అనిపించవచ్చు. దాని అర్థం వారు సరియైన సూచనలు ఇవ్వడం లేదని కాదు. వారు కేవలం, మనం రోజువారీ పదహారు మాలల జపం శ్రద్ధతో చేయాలనీ, నాలుగు ఆధ్యాత్మిక నియమాలను పాటిస్తూ (మాంసాహారం; జూదం; మత్తు పదార్థాల సేవనం; అక్రమ లైంగిక సంబంధాలు - ఈ నాలుగు కర్మలకు దూరంగా ఉండటం అనునవి 4 ఆధ్యాత్మిక నియమాలు) భక్తియోగ సాధనను హృదయపూర్వకంగా నిర్వర్తించాలని కోరుకుంటున్నారు అని అర్థం చేసుకోవాలి. ప్రతి భక్తునికి నిర్దేశించిన సూత్రాలను మనం పాటించాలని ఆయన కోరుకుంటున్నారని అర్థం చేసుకోవాలి. ప్రతి రోజు తెల్లవారుజామున లేవాలని, కుదిరితే బ్రహ్మ ముహూర్త సమయంలో లేవాలని ఆయన కోరుకుంటున్నారు. మనం భగవద్గీత మరియు శ్రీమద్-భాగవతాలను అధ్యయనం చేయాలని ఆయన కోరుకుంటున్నారు. మనం దయ గల వారిగా ఉండాలని ఆయన కోరుకుంటున్నారు. మనం వైష్ణవుల పట్ల గౌరవంగా మెదలాలని మరియు ప్రతి వైష్ణవుని గురువుగా చూడాలని ఆయన కోరుకుంటున్నారు!

## ఒక ముఖ్యమైన చింతన

మంగళ ఆరతి సమయంలో మనమొక విషయం గమనించవచ్చు - మండుతున్న ఈ భౌతిక ప్రపంచపు కార్చిచ్చులో మనం చిక్కుకుని ఉన్నామని! కానీ తెలుసుకోవలసిన అసలు విషయం ఏమిటంటే, ఆధ్యాత్మిక గురువు యొక్క దయ మాత్రమే ఈ మండుతున్న కార్చిచ్చును ఆర్పివేయగలదని.

## అతి గొప్ప నిధి

ఆధ్యాత్మిక గురువు యొక్క సూచనలు తలపై ధరించే శిరోమణుల వంటివి! ఆ సూచనలు ఒక గొప్ప నిధి లాగా మనల్ని ఆధ్యాత్మిక మార్గంలో ముందుకు తీసుకువెళతాయి. ఆధ్యాత్మిక గురువు ఏది చెప్పినా అది అతి ముఖ్యమైనదిగా పరిగణించబడాలి.

## వెలకట్టలేని క్షణాలు

ఆధ్యాత్మిక గురువుతో గడిపే ప్రతి క్షణం అత్యంత విలువైనది. ఆ క్షణాన ఎలాంటి గొప్ప మార్పులు సంభవించనప్పటికీ, పెద్ద నాటకీయ పరిణామాలు చోటు చేసుకోక పోయినప్పటికీ కూడా, శిష్యుడు ఎప్పుడూ ఇలా ఆలోచించాలి, "అసలు ఒక శిష్యునికి ఉండవలసిన సరైన ప్రవర్తన నాలో ఉందా? నేను నిజంగా శిష్యుడిగా సరైన స్థానాన్ని నిర్వర్తిస్తున్నానా?" అని . శిష్యుడు తనను తాను ఆధ్యాత్మిక గురువు యొక్క సేవకుడిగా గుర్తెరిగి పూర్తిగా అందుబాటులో ఉంచుకోవాలి.

## గొప్ప ఆశీర్వాదాలు

ఆధ్యాత్మిక గురువు తన హృదయంలో ప్రగాఢంగా మన పట్ల సంతుష్టుడై ఉన్నప్పుడు వారి గొప్ప ఆశీర్వాదాలు మనకు లభిస్తాయి. ఆధ్యాత్మిక గురువు మన పట్ల నిజంగా సంతృప్తుడైనపుడు కృష్ణుడు కూడా చాలా సంతోషిస్తాడు; స్వయంచాలకంగా మన పై ఆ దయా వర్షం కురుస్తుంది, తద్వారా మన జీవితంలో గొప్ప అద్భుతాలు జరుగుతాయి. కాబట్టి ఒకరు నిజంగా ఒకరి సాధారణ భౌతిక జీవన మార్గం నుండి బయటపడాలని అనుకుంటే, తమ ఆధ్యాత్మిక గురువు నిజంగా సంతోషించేలాగ వారి ప్రయత్నాలను కొనసాగించాలి.

## చిన్న చిన్న విషయాలకై గురువు శరణు పొందుట

శరణాగతి అంటే ప్రతి చిన్న విషయానికీ గురువు వద్ద లొంగిపోయి ఉండటమే అని శ్రీల ప్రభుపాదులు బోధించారు. ఇది ఒక పెద్ద శరణాగతి మాత్రమే కాదు: "కృష్ణా, నేను నా జీవితాన్ని నీకు సమర్పిస్తున్నాను!" మనం భక్తి మార్గంలో ఎన్నో నాటకీయ వాగ్దానాలను చేసి ఉండవచ్చు! కానీ వాస్తవం ఏమిటంటే మనం తరుచూ చిన్న చిన్న నియమాలను విస్మరిస్తుంటాం. కానీ ఆ చిన్న విషయాలే ముఖ్యం! అందువల్ల ఆధ్యాత్మిక గురువు యొక్క ఆరాధనంటే పువ్వులు లేదా అగరబత్తులు సమర్పించడం మాత్రమే కాదు, అంత కంటే ఎక్కువ. మనము ప్రతి కార్యంలో ఆధ్యాత్మిక గురువును ఆరాధించాలి.

## ప్రత్యేక ప్రయత్నం

ఆధ్యాత్మిక గురువును ఆరాధించడం అనేది ఒకరి వ్యక్తిగత ఆరాధనకు మించి, ఆధ్యాత్మిక గురువును వాస్తవంగా సంతోషపెట్టే స్థాయికి చేరుకోవాలి. ఆంగ్ల భాషలో కృష్ణ ప్రచారం గావించమని, శ్రీల ప్రభుపాదులు తన ఆధ్యాత్మిక గురువు నుండి ఆజ్ఞను స్వీకరించినప్పుడు, వారు ఆంగ్ల భాష మాట్లాడే దేశాలలో కృష్ణ చైతన్యాన్ని ప్రచారం చెయ్యాలని ఆ రోజుల్లో అర్థం చేసుకున్నారు. ప్రభుపాదులు ఆ ఆజ్ఞని చాలా దూరం తీసుకువెళ్లారు. గురు ఆజ్ఞ ప్రకారం, వారు పాశ్చాత్య ప్రపంచంలో కొంత బోధించి ఉంటే సరిపోయేది, కానీ ప్రభుపాదులు ఆ సేవని గరిష్ట లాభార్థం నిర్వర్తించారు.

వారు భాష పరంగా మాత్రమే కాకుండా, వారి పుస్తకాల అనువాదాలను ఇంగ్లీష్ నుండి సుమారు డెబ్బైకి పైగా భాషలకు విస్తరించారు. భూగోళాన్ని మొత్తాన్ని పర్యటించడం ద్వారా కూడా తమ గురు ఆజ్ఞను విస్తరించారు. 'ఇంగ్లీషు భాషలో బోధించు' అనే తమ గురువు యొక్క సరళ పదాల ఆధారంగా ప్రపంచాన్ని మొత్తం ముక్తి గా-

వించడమే గాక, ఆ ఆజ్ఞనే జీవిత లక్ష్యం అని భావించి వారు దానిని అంతకంతకూ నెరవేర్చుకుంటూ వెళ్లారు. కాబట్టి ఆధ్యాత్మిక గురువు సూచనలకు విధేయత ఎక్కడ ప్రారంభమవుతుంది మరియు ఎక్కడ ముగుస్తుంది? అసలు దానికి ఆది - అంతం అనేది ఉందా?

## శిష్యుని పవిత్రత

పవిత్రత తప్పనిసరి. శిష్యులు పూర్తిగా పవిత్రంగా ఉండాలని, పూర్తిగా అంకితభావంతో ఉండాలని మరియు ఆధ్యాత్మిక గురువుపై దృష్టి కేంద్రీకరించాలని శాస్త్రాలందు చెప్పబడింది.

ఆధ్యాత్మిక గురువు చాలా ఉన్నతమైన, మహత్తర ఆధ్యాత్మిక వేదికపై పనిచేసే వ్యక్తి అని ప్రతి శిష్యుడు అర్థం చేసుకోవాలి. ఆ ఉన్నత స్థితి యందు నిమగ్నమైన వ్యక్తిగా, ఆధ్యాత్మిక గురువు పరిశీలనలు మన సొంత వాటికంటే చాలా ఉత్తమమైనవని మరియు ఉన్నత స్థాయిలో జరుగుతున్నాయని అర్థం చేసుకోవడానికి శిష్యుడు ప్రయత్నించాలి. మన సొంత ఆలోచన ఈ భౌతిక వేదికపై జరుగుతోంది; మన ఆలోచన త్రిగుణాలకు లోబడి జరుగుతుంది.

ఆధ్యాత్మిక గురువు యొక్క మనోభావాలు మరియు ఆలోచనలు మన కంటే చాలా ఉన్నత స్థాయి పవిత్రతను కలిగి ఉంటాయి. కాబట్టి మనం ఆధ్యాత్మిక గురువు యొక్క మానసిక స్థితిని గ్రహించి, అందు వీలైనంతగా నిమగ్నమవ్వడానికి ప్రయత్నించాలి. ఆధ్యాత్మిక గురువు యొక్క మానసిక స్థితి అనేది అతని ఆలోచనా విధానం మరియు అతని వ్యవహార శైలి యొక్క సంగ్రహణం. అతను జ్ఞానమును బోధించు విధానాన్ని మాత్రమే కాకుండా, అతను ఎలా చెప్తున్నాడు మరియు చెప్పిన విషయాలను ఎలా ఆచరిస్తున్నారో గమనించాలి. కేవలం పదాలను వినడమే కాకుండా ఆధ్యాత్మిక గురువు ఎలా వ్యవహరిస్తారో కూడా పరిశీలించాలి.

ఒక వినయం గల శిష్యుడు ఆధ్యాత్మిక గురువు యొక్క మానసిక స్థితిని అనుకరించడం ద్వారా కాకుండా ఆ మానసిక స్థితి యొక్క స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఆధ్యాత్మిక గురువు తృణాద్ అపి సునీచేనా (శిక్షాష్టకం 3) - వినయాన్ని ఏ పద్ధతిలో వ్యక్తపరుస్తాడు, ఎలా సహనాన్ని కలిగి ఉంటాడు, ఇతరులకు ఎలా గౌరవం ఇస్తాడు మరియు వైష్ణవ లక్షణాలను ఎలా వ్యక్తపరుస్తాడో అర్థం చేసుకోవడానికి శిష్యుడు ప్రయత్నించాలి.

## గురువు యొక్క మానసిక స్థితిని అనుసరించడం

ఆధ్యాత్మిక గురువు యొక్క మానసిక స్థితిని అనుసరించడం అంటే ఏమిటి? ఆధ్యాత్మిక గురువుకు నిజంగా ఏది ముఖ్యమైనదో అది శిష్యుడికి కూడా అవసరం అని అర్థం చేసుకోవాలి. అంటే కానీ మనం ఆధ్యాత్మిక గురువు యొక్క జిరాక్సు కాపీగా మారడమని కాదు.

మనమందరం అనాదిగా ప్రత్యేకమైన వ్యక్తిత్వం, ప్రత్యేక స్వభావం మరియు కృష్ణుడితో ప్రత్యేక సంబంధమును కలిగి ఉన్నాము. కావున కృష్ణుడిని సేవించడంలో కూడా ప్రతి ఒక్కరికీ తనదైన ప్రత్యేక లక్షణం ఉంటుంది.

ఇది వేర్వేరు వ్యక్తులకు భిన్నంగా అనిపించవచ్చు కానీ, ఆధ్యాత్మిక గురువు, మనం ఆధ్యాత్మిక ప్రపంచానికి తిరిగి వెళ్లడానికి మనకు ఏ మార్గం సులభతరమో, ఆ మార్గాన్ని గురించి నొక్కి చెప్పడాన్ని మనం అభినందించాలి. మనకు

భిన్నమైన స్వభావాలు ఉన్నందున ప్రతి ఒక్కరూ ఈ విషయాలను ఒకే విధంగా అమలు చేయాలనీ కోరుకోవడం సరి కాదు, అయితే ఆధ్యాత్మిక గురువుకు ఏ సేవ ముఖ్యమైనదో అని మాత్రం మనం గమనించాలి.

## మనం గురువు యొక్క ఆస్తి!

చైతన్య-చరితామృతంలో ఒక ఆసక్తికరమైన సంఘటన ఉంది. ఒకసారి శ్రీ జగన్నాథ పూరిలో, సనాతన గోస్వామికి ఒక వ్యాధి వలన శరీరం అంతా చీము కారుతున్న పుండ్లతో బాధాకరమైన పరిస్థితుల్లో ఉన్నప్పుడు, శ్రీ చైతన్య మహాప్రభువు వారిని కలిసి అప్యాయంగా కౌగిలించుకున్నారు. ఇలా జరగడం చూసి సనాతన గోస్వామి 'ఇది మీ పట్ల నేను చేసిన గొప్ప అపరాధం, ఇక నేను ఇప్పుడు జీవించి ఉండటానికి అర్హుణ్ణి కాదు, నా శరీరాన్ని ఇప్పుడే త్యజించాలి' అని అన్నారు. దానికి శ్రీ చైతన్య మహాప్రభు, "లేదు! నీవు ఎప్పుడైతే నా యందు శరణు పొందావో, అప్పటి నుంచే నీ మనస్సు, వాక్కుతో పాటు, నీ శరీరం కూడా నా ఆస్తి అయిపోయింది, ఇప్పుడది నీది కాదు." అని అన్నారు.

అవును, మనమందరం పరమాత్మ యొక్క ఆస్తి. ఆధ్యాత్మిక గురువును కొన్నిసార్లు భగవంతుని యొక్క 'పోస్ట్‌మ్యాన్' (ప్రతినిధి) అని, కొన్నిసార్లు పరమాత్మ యొక్క దూత అని అంటారు. కావున, కృష్ణుడి తరపున ఆధ్యాత్మిక గురువు మనల్ని తన ఆస్తిగా పరిగణిస్తాడు. మనం గురువు యొక్క ఆస్తి ఐన కారణంగా మన పై పూర్తి అధికారం వారికుంటుంది. మనకు ఎటువంటి ఆదేశాన్నైనా సరే ఇచ్చే పూర్తి అధికారం ఆయనకు ఉంది.

## స్ఫూర్తి ప్రదాత

ఆధ్యాత్మిక గురువు భక్తి యుత సేవలో చాలా లోతుగా నిమగ్నమై ఉంటాడు, దీనిని కొన్నిసార్లు భావ స్థితి అని పిలుస్తారు. కృష్ణుని యొక్క సేవలో భావ స్థితి లాంటి పారవశ్యానికి గొప్ప స్థానం ఉంది.

ఇలాంటి భావ స్థితిలో ఉన్న వ్యక్తి తన ఉనికి ద్వారా ఇతరులకు కూడా స్ఫూర్తిని ఇవ్వగలరు. ఒక స్వచ్ఛమైన భక్తుని సాన్నిధ్యం వలన, లేదా అతని భావ ఛాయ వలన మనలో కూడా కృష్ణుడికి సేవ చేయాలనే ఉత్తేజాన్ని వారు నింపుతారు. అప్పుడు ఉద్దేశపూర్వకంగా కాకపోయినా: "నాకు కూడా ఈ ఆధ్యాత్మిక జీవితమే కావాలి! " అన్న భావన మనకు కలుగుతుంది.

## గురువు మన గొప్ప శ్రేయోభిలాషి

ఆధ్యాత్మిక గురువు కేవలం ఒక ఉత్తమ అధికారి మాత్రమే కాదు, ఆయన ప్రతి ఒక్కరి యొక్క శ్రేయోభిలాషి కూడా. మనం బాగా వృద్ధి చెందుతున్నామా లేదా అని చూడడం తప్ప ఆధ్యాత్మిక గురువుకు వేరే ఆసక్తి ఉండదు. శ్రీల భక్తి సిద్ధాంత సరస్వతి ఠాకురులు కొన్నిసార్లు 'మీ శ్రేయోభిలాషి' అని తన లేఖలపై సంతకం చేసే వారు. ప్రభుపాదుల వారు కూడా వారి గురువు గారి పద్ధతిని అలవాటుగా మార్చుకొని ఆయన కూడా ఈ మూడు పదాలతోనే తన లేఖలపై సంతకం చేయడం మొదలు పెట్టారు.

ఆధ్యాత్మిక గురువు ఎప్పుడు మనకు శ్రేయోభిలాషే. ఇది చాలా విశిష్టమైన స్థానం. ఆయన ఒక వ్యక్తిని దయతో తన శిష్యునిగా స్వీకరించినప్పటి నుంచే ఆయన ఆ పాత్రలో ఎప్పుడు శ్రేయోభిలాషిగానే ఉండిపోతారు. కానీ అదే

శిష్యుడు ఒక హంతకుడిగా మారితే లేదా మరేదైనా ఘోరమైన నేరం చేస్తే? అప్పుడు ఆయన ఏం చేస్తారు? ఎప్పుడూ శ్రేయోభిలాషిగా ఉండడం అంటే ఇదే! ఇంత దయ గల మహనుభావుడి మానసిక స్థితిని భంగ పరిచే విధంగా ఒక శిష్యుడు ఎప్పుడు ప్రవర్తించకూడదు. ఇది నిజంగా ఒక గొప్ప విషయం!!

## గురువు భగవంతునికి శిష్యునకు మధ్యవర్తి

ఆధ్యాత్మిక గురువు కృష్ణుని యొక్క దయకు ప్రతిరూపం. ఆయన మన సేవను ఒక వైపునుండి స్వీకరిస్తున్నప్పటికీ, మరొక వైపు నుండి మనం చేసిన సేవను కృష్ణుడికి అర్పిస్తున్నారు. ఆధ్యాత్మిక గురువు అంటే శిష్యునికి మరియు భగవంతునికి మధ్య వారధి. గురువుని ప్రసన్నం చేసుకోనిదే, మనకు కృష్ణుని కృప లభించదు. ఆధ్యాత్మిక గురువు ప్రతీదీ వ్యక్తిగతంగా గమనించక పోయినా, కృష్ణుడు మాత్రం ప్రతీదీ గమనిస్తూనే ఉంటాడు.

మన శాస్త్రాలలో ఎన్నో చోట్ల ఆధ్యాత్మిక గురువు కృష్ణుడు యొక్క ప్రత్యక్ష ప్రతినిధి అని వివరించబడింది. ఆధ్యాత్మిక గురువు రూపంలోనే శ్రీ కృష్ణుడు తన శిష్యులను అనుగ్రహిస్తారని చెప్పబడింది. ఒకరు ఆధ్యాత్మిక గురువును స్వీకరించిన తర్వాత, కృష్ణుడు కూడా ఆ ఆధ్యాత్మిక గురువు ద్వారానే మన సేవలను అంగీకరిస్తాడు. అంటే కాక ఆ గురు, శిష్య సంబంధానికి కట్టుబడి ఉంటాడు కూడా. కానీ భక్తియుత సేవ ద్వారా మాత్రమే అది సాధ్యపడుతుంది. ఈ గురు శిష్య సంబంధం ఆవల మనం కృష్ణుడికి చేసే సేవ మనకి అంత అనందాన్ని కలిగించదు, కృష్ణుడిని ఆకర్షించేంత శక్తినీ కలిగి ఉండదు.

## ఒక బలమైన బంధం

నిజానికి శిష్యుడిగా ఉండడమనేది అంత సులభం కాదు. శిష్యునిగా ఉండడమంటే, నిర్దేశించిన ప్రమాణాలను పాటించడం మరియు వేద నియమాలను అనుసరించడం. గురువు మరియు శిష్యుల మధ్య ఉన్న సంబంధం, వారిరువురి నడుమ గల మానసిక స్థితి ఆధారంగానే కాక, కృష్ణునిచే నిర్వహించబడుతుంది. గురు శిష్యుల బంధం ఒక క్లిష్టమైన సంబంధం. దానికి చాలా కృషి అవసరం. ఇది అంత సులువు కాదు; "ఇప్పుడు నేను శిష్యుడిని కాబోతున్నాను!“ అని అనుకుంటే మాత్రం సరిపోదు. శిష్యుడిగా ఉండాలంటే నిజంగా చాలా కృషి చేయాలి! ఇదేమంత సాధారణ విషయం కాదు!. ఈ సంబంధంలో మనం ఎప్పుడూ జాగరూకతతో ఉండాలి. లేక పోతే మన ఆధ్యాత్మిక ప్రగతికే ప్రమాదం; ఆ జాగరూకత లోపించిన, ఆధ్యాత్మిక విషయాల పట్ల ఆసక్తి తగ్గిపోయి మన మనసులో నిజమైన పరివర్తన కలగదు. ఈ ప్రపంచంలో సంబంధాలు ఇద్దరు వ్యక్తుల మధ్య ఉండే మానసిక భావనలతో ముడిపడి ఉంటాయి, అయితే గురు-శిష్యుల సంబంధం మాత్రం శాస్త్ర నియమాలతో ముడిపడి ఉంటుంది. ఇది అత్యంత దృఢమైన స్నేహ బంధం, విశ్వాసం మరియు త్యాగాల తో ఏర్పడిన ఒక నిజమైన అనుబంధం.

చాందోగ్య ఉపనిషత్తులో మూడు రకాల ఆధ్యాత్మిక గురువుల గురించి వివరింపబడింది. ఒకరు తన పిల్లలకు నిరంతరం ఆహారాన్నందించే తల్లి పక్షి వంటివారు. మరొకరు పర్యవేక్షించే చేపలా, పిల్లలను తమ సొంత దారిపై వెళ్లనిచ్చేవారు, వారు ఆపదలో పిల్లలను వెళ్ళనిచ్చినా కానీ, అక్కడే ఉండి వారిని రక్షిస్తారు. మూడవ రకం వారు తాబేలు వలే సముద్రపు ఒడ్డున ఇసుకలో గుడ్లను ఉంచి, సూర్యుని వేడిచే గుడ్లు పగిలి పిల్లలు బయటకు వచ్చే వరకు కాపలాగా ఉండే వారు. ఇవన్నీ కూడా గురు-శిష్యుల బంధం లో దాగి ఉన్న నిఘాఢ సత్యాలు.

## హృదయ పరివర్తన

దీక్ష అనేది గురువు ద్వారా మనకు ఆధ్యాత్మిక మరియు అతీంద్రియ జ్ఞానాన్ని సముపార్జించి పెట్టే ఒక ప్రక్రియ. అలాంటి ఆధ్యాత్మిక జ్ఞానం కేవలం పుస్తక జ్ఞానం నుంచి మాత్రమే రాదు. ఆధ్యాత్మిక గురువు మనకు కేవలం పుస్తక జ్ఞానాన్ని మాత్రమే కాదు, దానితో పాటు మనకు కృష్ణ చైతన్యాన్ని ప్రసాదిస్తున్నారు .

శ్రీ కృష్ణ భగవానుడు తనను తానుగా ఒక జ్ఞానము మరియు చైతన్యం పొందిన ఆధ్యాత్మిక గురువు రూపంలో మన ముందు వ్యక్తమవుతూ ఉన్నాడు, ఆ జ్ఞానం ఆధ్యాత్మిక గురువు ద్వారా శిష్యునికి సంక్రమిస్తుంది. క్రమక్రమంగా ఆ జ్ఞానం శిష్యునిలో వృద్ధి చెందుతుంది. ఆధ్యాత్మిక జ్ఞానం ఒక విత్తనం రూపంలో ఇవ్వబడుతుంది, అది క్రమంగా మొలకెత్తి, పెద్ద వృక్షమై మనకు అమృత ఫలాలను అందిస్తుంది.

## ఒక అవినాభావ సంబంధం

గురు-శిష్యుల సంబంధం ఇరువురికీ ప్రేరణనిస్తుంది. కేవలం గురువే ఎల్లవేళలా శిష్యుడికి స్ఫూర్తినివ్వడం కాకుండా, శిష్యులు చేసే అద్భుతమైన పనులు చూసి గురువుకి చాలా అనందం కలుగుతుంది. పుస్తకాల వితరణ సంఖ్యను విన్నప్పుడల్లా అది తనకు అమిత సంతృప్తినిస్తుందని శ్రీల ప్రభుపాదుల వారన్న మాటలను మనం గుర్తుపెట్టుకోవాలి. అలాగే శిష్యులు అభివృద్ధి చెందడం, ఆధ్యాత్మిక గురువుకు గొప్ప ఆనందాన్ని కలిగిస్తుంది.

## దృఢమైన స్నేహం

గురువు మరియు శిష్యుల మధ్య ఉన్న బంధం కేవలం ఒక యజమాని మరియు సేవకుడికి మధ్య ఉన్న సంబంధం కాదు, ఎందుకంటే వారి మధ్య ఉండేది ఒక దృఢమైన స్నేహం. గురువు మరియు శిష్యుడు పరస్పరం ఒక స్నేహితుడు మరియు శ్రేయోభిలాషిలా జీవితాంతం తోడుగా ఉంటారని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. శిష్యుడెప్పుడూ తన గురువు పై నమ్మకముంచి ఆయనతోనే తన ఆధ్యాత్మిక జీవితాన్ని కొనసాగించాలి.

కొన్నిసార్లు ప్రభుపాదుల వారు తమ లేఖలలో 'నా ప్రియమైన కుమారులకు, కుమార్తెలకు...‘ అని సంతకం చేసే వారు. కాబట్టి ఇక్కడ తల్లిదండ్రుల భావన దాగి ఉంది, ఆధ్యాత్మిక గురువు తన శిష్యులకు తల్లి తండ్రి వలె మార్గదర్శకం చేసే అనుభవం మరియు బాధ్యతను కలిగి ఉంటారు.

## శిష్యుని బాధ్యత

గురు శిష్య బంధంలో, గురువుకి అధిక ప్రాధాన్యత ఉన్నప్పటికినీ, శిష్యుడే ఎలా అయినా చొరవ తీసుకుని ముందడుగు వేయాల్సి ఉంటుంది. మనం జపం శద్ధతో చెయ్యాలి, శ్రీమద్-భాగవత పఠనం మొదలైన వాటిలో లీనమై ఉండాలి. ఆధ్యాత్మిక గురువు యొక్క దయను స్వీకరించి దాని ప్రకారం పని చేసే బాధ్యత మన పైనే ఉంటుంది. గురువు మన గురించి ప్రార్థించవచ్చు, ఆశీర్వదించవచ్చు కానీ పాటించాల్సింది మాత్రం మనమే, లేకుంటే మనం ఏ పని చేయకుండానే కృపా సిద్ధుడిగా (కృష్ణుడి మరియు ఆధ్యాత్మిక గురువు యొక్క ప్రత్యేక దయతో పరిపూర్ణతను

పొందిన వ్యక్తి) ఉండటానికి ప్రయత్నిస్తున్నట్టు. సాధన-సిద్ధి (నియమాలు మరియు నిబంధనల ప్రకారం భక్తియుత సేవను అమలు చేయడం ద్వారా పరిపూర్ణత పొందడం) అనేది అవసరం.

## శిష్యుని అంకితభావం

మనం నయానో భయానో ఆధ్యాత్మిక గురువుకి మరియు వైష్ణవులకి అంకితమైన సేవకునిగా మారి తీరాల్సిందే. ఈ భావనను మదిలో ధృడంగా స్థిర పరుచుకోవాలి. ఆ సేవా భావం ఎలా ఉండాలి అనంటే, ఎలా అయితే పిండి లేదా మట్టి ఒక వ్యక్తి యొక్క సృజనాత్మకతకు అనుగుణంగా వివిధ రూపాల్లో తనను తాను రూపాంతరం చెందటానికి అనుమతిస్తుందో, అలా వైష్ణవుల చేతుల్లో వారు కోరుకున్నట్లు మనం వారి సేవ పట్ల అనుగుణంగా మారాలి. అది అంత సులభం కాదు. వారు కష్టమైన పనులను అభ్యర్థించవచ్చు. కానీ ఆశీర్వాదాలు పొందాలంటే, ఉదారంగా మారాలి మరి!

కొన్నిసార్లు మనం, “అవును, నేను ఆదివారం మధ్యాహ్నం 3:30 నుండి 4:35 గంటల మధ్య కొంత సేవ చేయగలను. అవును, నేను చేయగలను.“ అని చెప్తాము. కానీ మనం అంతకంటే గొప్పగా సేవ చేయగలమని గమనించాలి. విశాల హృదయంతో, మనం ఒక వైష్ణవుడి దగ్గరకు వెళ్లి, “ప్రభూ! నేను మీకు ఏ విధంగా సేవ చేయగలను?” అని అడగాలి. ఆ వైష్ణవుని ఏదైనా చెప్పనివ్వండి! అతను మనల్ని ఏదైనా అడగనివ్వండి. ఆ భక్తుని లేదా భక్తురాలిని మనం వారు అడిగిన దానికి అనుగుణంగా సేవించడానికి ప్రయత్నించాలి. కాబట్టి ఈ వైష్ణవ సేవా ధర్మం, మన ఆస్తులలో కొన్నింటిని సరళంగా దానం చేసేది కాదు, అంతకు మించి గొప్పది. ఇది పూర్తిగా మనల్ని మనం ఇతరులకు సమర్పించడానికి సంబంధించిన విషయం.

## గురువు ఒక్కడే

“గురువు ఒక్కడే“ అని శ్రీల ప్రభుపాదులు అన్నారు. అయితే ఈ పారమార్థిక ఆధ్యాత్మిక బోధనలు కాలానుగుణంగా వేర్వేరు వ్యక్తుల నుండి మనకు మూర్తీభవిస్తాయి. అందుకే మన జీవితంలో వేర్వేరు గురువులు కనిపించవచ్చు - శిక్ష గురువు, దీక్ష గురువు మరియు సాధారణ వైష్ణవులు. మనం ఎప్పుడూ కూడా వీరి ఆశీర్వాదాల పైనే ఆధారపడి ఉండాలి. కానీ దీక్ష గురువు మాత్రం ఒక్కడే.

## గురువుకు కృష్ణుడితో ప్రత్యేక సంబంధం ఉంటుంది

ఆధ్యాత్మిక గురువు అంటే కృష్ణుడికి ప్రియమైన వ్యక్తి, మనం ప్రణామ మంత్రంలో గుర్తించినట్లుగా: 'కృష్ణ-ప్రస్థాయ భూతలే..‘ ఆయన కృష్ణుడికి ఎంతో ప్రియమైనవాడు, ఎందుకంటే కృష్ణుని కోసం తన సర్వస్వాన్నీ ఆయన త్యాగం చేశారు. అందువల్ల ఆయనకు కృష్ణుడితో ప్రత్యేక అనుబంధం ఉంది మరియు అతను ఆ కృపను మన కోసం ఉపయోగిస్తున్నారు!

కాబట్టి ఆయన మామూలుగా, 'నేను నిన్ను అంగీకరిస్తున్నాను!‘ అని చెప్పినా చాలు, అది నిజంగా మనల్ని శిష్యులుగా అంగీకరించినట్లే లెక్క. దాని అర్థం వారు మన శ్రేయస్సు కోసం నిత్యం కృష్ణుని వద్ద ప్రార్థిస్తూనే ఉంటారని.

అందుకే ఇది కేవలం ఒక చిన్న నిస్సారమైన ప్రకటన కాదు, అది నిజంగా గురువు యొక్క హృదయం నుండి ఉద్భవించిన భావన.

## ఇది కృష్ణుని పాదాల చెంత స్థిరపడిన బంధం

జీవితం కొన్నిసార్లు మనల్ని ఒడిదుడుకులకు గురి చేస్తుంది, మన పరిస్థితి అల్లకల్లోలంగా తయారవుతుంది. అట్టి కఠిన పరిస్థితుల్లో కూడా గురువు మనతోనే ఉన్నారని గుర్తుచేసుకొని ధైర్యంగా ఉండాలి. ఆయన కృష్ణునికి చేసే సేవ, ధ్యానం, ఆధ్యాత్మిక చింతన మొదలగు వాటిని గుర్తు చేసుకొని ప్రేరణ పొందాలి. అదే గురు శిష్య బంధం యొక్క అసలు ఉద్దేశ్యం!

కనుక ఇదొక అద్భుతమైన విషయం, ఎందుకంటే మన గురువు కృష్ణుడి పాదాల వద్ద తన జీవితాన్ని అర్పించారు. కనుక, మనకు కష్టం వచ్చినప్పుడల్లా మనం మన గురువు వైపు మరలితే చాలు, మనం కృష్ణుడి వైపు తిరిగినట్టు లెక్క. ఇది చాలా సులభం! ఇది అర్థం చేసుకోవడానికి పెద్ద తత్త్వవేత్త కావాల్సిన పని లేదు. మనము ఎంత ఎక్కువగా గురువు సాంగత్యంలో ఉండి ఆయనకు సేవ చేస్తామో, అంత ఎక్కువగా కృష్ణుడు మనకు దగ్గర అవుతాడు. ఆపై మనం మళ్ళీ మళ్ళీ ఆధ్యాత్మిక జీవితంలో నూతనోత్సాహం పొందగలము.

ఒక పరిణితి చెందుతున్న అనుబంధం

కొన్నిసార్లు ప్రారంభ దశలలో, భక్తులు ఆధ్యాత్మిక గురువుతో గల తమ సంబంధాన్ని అదే తమ సర్వస్వమని భావిస్తారు. కానీ తరుచూ వారు ఆ సంబంధం నుండి నేను ఏమి పొందగలనో అనే ఆలోచిస్తారు - రోజూ ఒక ఉత్తరం, మధ్యలో ఒక ఫోన్ కాల్ - వీలైనంత ఎక్కువగా వీటిని పొందడానికి చూస్తారు. అది సరైన పద్ధతి కాదు! ప్రతిగా మనం, మన ఆధ్యాత్మిక గురువుకు తగినంతగా ఇవ్వడం నేర్చుకోవాలి.

మనం మన గురువుకు ఏం ఇస్తున్నామనేదే గురు శిష్యుల బంధానికి కీలకం. మనం మన సేవలను గురువుకు మనస్ఫూర్తిగా సమర్పించాలి మరియు ప్రతిఫలంగా ఏది వచ్చినా అంగీకరించాలి. అప్పుడే మనం దానిని అభినందించ గలుగుతాము. శరణాగతితో, సేవలో మనల్ని మనం ఎంతగా అర్పించుకోగలిగితే, మనకు వచ్చిన ప్రతిఫలాన్ని చూసే నేత్రాలు కూడా మనకు అంతలా ప్రస్ఫూటమవుతాయి. ఈ మేల్కొలుపు మనం పొందుతున్న దయను ఎలా సద్వినియోగం చేసుకోవాలి అనే జ్ఞాన శక్తిని, అంతర్దృష్టిని మరియు తెలివిని మనకు ప్రసాదిస్తుంది.

ఒక ఆధ్యాత్మిక గురువు సమక్షంలో ఉన్నంత మాత్రాన్నే మనం గొప్ప ఆధ్యాత్మిక లాభాన్ని పొందగలము, మనం గురువు యొక్క మానసిక స్థితిచే ప్రభావితం అవుతాము. "అసలు ఈ చిన్న చిన్న విషయాలనే నేను ఎందుకింత పెద్ద సమస్య అని భావిస్తున్నాను?" అని ఆలోచించనారంభిస్తాము. కృష్ణుడి పట్ల ఆయనకున్న నిబద్ధతను మనం చూస్తాము, అతను అనేక ఒడిదుడుకులను ఎదుర్కొన్నప్పటికీ కృష్ణ భక్తి పట్ల స్థిరచిత్తంతో ఉన్నాడని గ్రహిస్తాము. మనమే భక్తి యుత సేవలో మన దృఢ నిశ్చయానికి, చిన్నపాటి భంగం కలిగించుకుంటున్నాం. ఈ విధంగా ఆధ్యాత్మిక గురువుతో సంబంధం మన స్థితిని మనకు తెలియజేసి, మన ఆధ్యాత్మిక పురోగతికి మరింత బలాన్ని చేకూరుస్తుంది.

ప్రారంభ దశలలో, మనం గురువుతో స్వేచ్ఛగా మాట్లాడటానికి భయపడవచ్చు, కానీ మన ఆధ్యాత్మిక పురోగతి ఎలా ఉందో ఆధ్యాత్మిక గురువుకు విన్నవించాలి. మనం ఎంత ఎక్కువ మన మనసును బహిర్గతం చేస్తే, వారు మనకు అంతగా సహాయం చేయగలరు. వారు మన నిజ శ్రేయోభిలాషి అని మనం అర్థం చేసుకోవాలి మరియు వారిని మనం నిరాశ పరుస్తామేమో అని భయపడకూడదు.

ప్రారంభంలో శిష్యుడికి ఆధ్యాత్మిక గురువుపై విశ్వాసం ఉన్నప్పటికీ, తరువాత అతను ఆధ్యాత్మిక జీవితంలో పరిపక్వం చెందుతున్న కొలదీ అధిక విశ్వాసాన్ని పెంపొందించుకుంటాడు. ఆధ్యాత్మిక గురువు మనపై తన పూర్తి విశ్వాసాన్ని ఉంచడం ప్రారంభిస్తాడు; గురువు కూడా శిష్యుడి పై గల విశ్వాసాన్నిపెంపొందించడం ప్రారంభి-స్తాడు: "ఓహ్, ఈ సేవను జాగ్రత్తగా నిర్వర్తించు." అని సేవలు అప్పగిస్తాడు. కొన్నిసార్లు మనకు చాలా కష్టమైన పనులు అప్పజెప్తాడు. ఇది నిజంగా గురు శిష్య సంబంధంలో తదుపరి దశ, ఈ దశలో మన సొంత బలం మరియు చొరవతో, మన ఆధ్యాత్మిక గురువుకు ప్రాతినిధ్యం వహించడానికి మరియు వారికి ముఖ్యమైన సలహాలను సూ-చించడానికి ప్రయత్నిస్తాము.

ఆధ్యాత్మిక గురువుతో సంబంధం అలా పరిపక్వం చెందుతున్నప్పుడు, అదొక ప్రశంసా పూర్వక స్నేహ బంధంగా మారుతుంది మరియు ఆ స్నేహం లోతైన కొలదీ, అది ప్రేమగా పరిణితి చెందుతుంది. ఆ దశలో మనం మన సొంత వ్యక్తిగత ప్రణాళికలను పక్కన పెట్టి వారిని నిజంగా సంతోషపెట్టడానికి ప్రయత్నిస్తాము. మనం ఇతరులకు కృష్ణ చైతన్యాన్ని అందించడమే, ఆధ్యాత్మిక గురువు కొరకు మనం చేయగలిగే అత్యంత సంతోషకరమైన సేవ.

## శిష్యులకు ఒక మార్గదర్శనం

తన శిష్యులు బాగా పనిచేస్తున్నప్పుడు ఆధ్యాత్మిక గురువు రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తాడు. కృష్ణ చైతన్యం ప్రా-రంభంలో మనం ఏమి చేస్తున్నామో ఆ సేవ పట్ల మాత్రమే చింతన ఉంటుంది, కానీ మనం పరిపక్వం చెందుతున్న-ప్పుడు, ఆ చింతన మనం ఎవరు అనే అన్వేషణ దిశగా సాగుతుంది. కాబట్టి మన ఆధ్యాత్మిక జీవితాలను గొప్పగా మార్చగలిగే కొన్ని లక్షణాలను మనం పెంపొందించుకోవడానికి ప్రయత్నించాలి.

## బలమైన వ్యక్తులు

మనం ఏకాగ్ర దృష్టితో, అసలు నేను ఏమి సాధించాలనుకుంటున్నాను అని గనక ఆలోచిస్తే, ఒక బలమైన వ్యక్తిత్వం గల మనిషిగా మారడం అని మనకు అవగతమవుతుంది. చిత్తశుద్ధిలో దృఢంగా, గుణగణాలలో ఉన్నతంగా, ఇచ్చిన మాటకు కట్టుబడి జీవించే వ్యక్తిగా, లాభ-నష్టాలతో సంబంధం లేకుండా, నియమాలను స్వీకరించే వ్యక్తిగా. కష్ట సుఖాలలో స్థితప్రజ్ఞునిగా ఉండగలగాలని కోరుకుంటాం.

నేనూ ఇలానే ఉండాలనుకుంటున్నాను. నా శిష్యులందరికీ కూడా ఇదే భోదించాలనుకుంటున్నాను. నా శిష్యులు సూత్రాల ప్రకారం జీవించేవారు, పరిస్థితితో సంబంధం లేకుండా వారు ఇచ్చిన మాట ప్రకారం జీవించేవారు, భ్రమ కలిగించే మాయా శక్తి బలంగా ఉందని గుర్తించగలిగేవారు, తమను తాము గమనించుకుని ఉండేవారై, వారి మనస్సుక కోరే వాంఛలకు బలైపోకుండా ఉండే వ్యక్తులుగా ఉండాలని నేను కోరుకుంటున్నాను. కానీ ఇంద్రియ వాంఛలకు ఎదురుపడి నిలవగల వారెవ్వరు? అంత సులభం కాదు. దీని కొరకై మనం జ్ఞాన సముపార్జనలో దృఢ

చిత్తంతో ఉండాలి. జ్ఞానమంటే కేవలం చిలుక పలుకులు కాదు. జ్ఞానమంటే శ్రద్ధ పెట్టి వినడం, గ్రహించడం మరియు ఆలోచించడం.

నా ఈ కృష్ణ చైతన్య జీవితం, చాలా విషయాల గురించి లోతుగా స్వతంత్రంగా ఆలోచించడం ద్వారా మాత్రమే సాధ్యపడింది. శ్రీమద్-భాగవత సేవ అంటే కేవలం వినడం మరియు చదవడం మాత్రమే కాదు, చదివిన దానిని ధ్యానం చేయడం, "దీని అర్థం ఏమిటి? నేను ఇక్కడ చదివిన దాని యొక్క పరిణామాలు నాకు ఎలా వర్తిస్తాయి? " ఉదాహరణకు, నేను కృష్ణ భగవానుడి శాశ్వత సేవకులమని చదివిన తర్వాత, ఏది ఏమైనా సరే, నేను ఎప్పటికీ కృష్ణుడి సేవకుడినే అన్న దృఢ నిర్ణయానికి రావాలి! ఈ నిర్ణయాన్ని మార్చగలిగేది ఏదీ ఈ ప్రపంచంలో ఉండకూడదు! ఈ రకమైన ఆలోచన చివరికి మనలను శ్రీల ప్రభుపాదులు ఆశించిన ఉత్తమ శ్రేణి వైష్ణవులుగా మార్చగలదు. ప్రభుపాదులు "స్వతంత్రంగా ఆలోచనాత్మకంగా వ్యవహరించండి" అని నొక్కి చెప్పారు. ప్రభుపాదుల ఈ వాక్యమంటే నాకు ఎంతో ఇష్టం. ప్రజలు వారి వారి జీవితాలతో ఏమి చేస్తున్నారు, అలా ఎందుకు చేస్తున్నారు అనే అంశాలపై నాకు సుదీర్ఘ చింతన ఉంది. వారి గురించి లోతుగా ఆలోచించే వ్యక్తుల కోసం నేను వెతుకుతున్నాను. నేను సరైన స్పృహతో, అర్థవంతంగా జీవించే వ్యక్తుల కోసం వెతుకుతున్నాను. అట్లు ఇతరుల గురించి ఆలోచించే ఆ భక్తులు అకుంఠిత దృఢ విశ్వాసంతో స్వతంత్రంగా, ఆలోచనాత్మకంగా మారగలరు. ఈ ప్రపంచాన్నే మార్చగలరు!

తమల్ కృష్ణ మహారాజును గమనించడం ద్వారా నేను నేర్చుకున్న విషయం - ఆధ్యాత్మిక గురువు యొక్క ప్రధాన కర్తవ్యం - శిష్యులకు ఒక ఉత్తమ ఆలోచనా దృష్టిని అందించడం. నా శిష్యులు అలాంటి దార్శనికత గల వారై ఉండాలని నేను కోరుకుంటాను. ఈ జన్మలో వారు ఎక్కడికి వెళుతున్నారు? ఏం సాధించాలని ప్రయత్నిస్తున్నారు? వారి జీవితాల పట్ల దార్శనికత కలిగి ఉన్నారా? ఒక గురువుగా ఈ విలువలను పెంపొందించేందుకు సహాయం చేయుటకై నేను ఎంతో సంతోషిస్తాను.

ప్రజలలో నేను చూడాలనుకునే మరో లక్షణం దయ. దయ చాలా ప్రధానం! మనము ఎక్కువ మట్టుకు దయను పొందే వైపునే ఉంటాము, కానీ అదే దయను ఇతరులపై చూపడం చాలా ముఖ్యం మరియు కష్టం. అయినప్పటికీ, ఇది ఒక బలమైన వ్యక్తిలో నేను చూడ గోరే అంశం. మనమందరం దయాగుణాన్ని అలవర్చుకొనుటకు ప్రయత్నించాలి. నా శిష్యులు వారి అసాధారణ దయకు పేరు గాంచినట్లయితే నేను ఎంతో సంతోషిస్తాను. దయ నిజంగా హృదయాలను జయిస్తుంది కాబట్టి దయా హృదయం కలిగి ఉండుటయే, ఒకరి నిజమైన విజయం అని నేను భావిస్తాను; మార్పుకు అదే నాంది.

ఈ దయా గుణం - శ్రీల ప్రభుపాదులలో నేను నిజంగా అభిమానించే ఒక ప్రధాన లక్షణం. శ్రీల ప్రభుపాదులు చాలా గొప్పవారు, కానీ మీరు అతన్ని చాలా దయగల, తెలివైన వ్యక్తిగా కూడా గమనించి ఉంటారు. నేను కూడా అలాగే ఉండాలని కోరుకుంటున్నాను.

వినయాన్ని పెంపొందించుకోవడానికి ప్రయత్నించడం చాలా ముఖ్యం. మన హృదయాలలో వినయం లేకపోతే దేవుని పై ప్రేమను పెంపొందించుకోవడం సాధ్యం కాదు. గర్వంతో ఉండే వ్యక్తి తన స్వంత అభిప్రాయాలతో నిండి ఉంటాడు; అలాంటప్పుడు ఇతరులు చెప్పేది, అతను ఎలా వినగలడు? అదే ఒకరు వినయంగా ఉంటే, 'అవును, నా పై దయ చూపండి' అని సౌశీల్యంగా ఉంటారు.

కాబట్టి వినయపూర్వకమైన వ్యక్తి ఇతరులు చెప్పేది వినడానికి ఆసక్తి కనబరుస్తాడు. ఉన్నత వైష్ణవుల నుండి వినడానికి అతను ఆసక్తి కలిగి ఉండటమనే అతని ప్రత్యేక గుణం, ఆ గుణం అతనికి సరికొత్త ఆధ్యాత్మిక ద్వారాలను తెరుస్తుంది. వినడానికి ఆసక్తి గల శ్రోతలు ఉన్నప్పుడు, ప్రసంగించే వైష్ణవుడు తన హృదయాంతరాళాన్ని బహిర్గతం చేస్తాడు. అతను స్వయంచాలకంగా, ప్రేక్షకుల ఆత్రుత ప్రేరణచే ప్రభావితుడై మరింత నిండిన ఉత్సాహంతో జ్ఞాన బోధ చేస్తాడు. అప్పుడతను తన హృదయంలో తనకే తెలియని అనేక సాక్షాత్కారాలు దాగి ఉన్నాయని కనుగొంటాడు! వైష్ణవుల మధ్య సంబంధంలో, మానసిక స్థితి ఎంతో సన్నిహిత పాత్ర కలిగి ఉంటుంది - లోతైన స్నేహం మరియు అంగీకార పూర్వక మానసిక స్థితి ఎంతో శ్రేయోదాయకం.

వినయం అంటే ఇతరులలో మంచిని చూడగలగడం మరియు ఆ మంచిని చేయటంలో ప్రతి ఒక్కరు పాలు పంచుకుంటున్నారనే విషయాన్ని ప్రశంసించ గలగడం. వైష్ణవుల మధ్య ఈ ప్రశంసా పూర్వక వాతావరణం ఉంటుంది.

అహం అనే గోడ - 'నేను' మరియు 'నాది' అనే తప్పుడు అహంకారంతో స్థిరపడింది. మనం 'నేను' మరియు 'నాది' అని గర్వంగా భావించినప్పుడు, ఆ గోడ మరింత ఎత్తుగా, మందంగా మరియు బలంగా మారుతుంది. వినయాన్ని పెంపొందించుకోవడం ద్వారా మనం అహం అను ఆ తప్పుడు గోడను కొంత వరకు కూల్చివేయగలము. అలా క్రమంగా కృష్ణుడిని ఆశ్రయించే స్థాయికి ఎదగగలం. అలా చేయగలిగిన, మనం హృదయాంతరాళం నుండి జపించడం, భక్తి పారవశ్యంతో నృత్యం చేయడం ఆరంభిస్తాము.

ఈ విధంగా మనం ఈ అహం అను తప్పుడు గోడకు కన్నం పెట్టి, ఆ కన్నం గుండా కృష్ణ భగవానుని సంగ్రహావలోకనం గావించవచ్చు. కొద్దికొద్దిగా ఆ గోడకి మరింత పెద్ద రంధ్రాలను ఏర్పరుస్తూ, కృష్ణుడి యొక్క రూపాన్ని మరింత దగ్గరగా చూడవచ్చు, అలా చివరకు ఒక రోజు గోడ ఆనవాలు ఏవీ మిగిలి ఉండవు. అప్పుడు కృష్ణుడు తనను తానుగా వచ్చి, వ్యక్తిగతంగా దయతో మనకు దర్శనమిస్తాడు. కృష్ణుడు ఆ గోడ దగ్గరికి వచ్చి దాన్ని తన్ని పడవేస్తాడు! అతను దానిని వ్యక్తిగతంగా ముక్కలు చేస్తాడు.

మనం జపించే ఈ మంత్రాలన్నింటినీ కలిపే తీగ పేరే - వినయం. ఆధ్యాత్మిక జీవితంలో విజయానికి ఆ వినయమే కీలకం. మన విధి పవిత్ర నామ జపం పై ఆధారపడి ఉంటుంది మరియు ఇది వినయమను స్ఫూర్తి సహాయంతో చేయాలి, ఇది మన కొరకు ఆశీర్వాదాల తలుపులను తెరుస్తుంది. వినయం ఉన్నప్పుడు, సహజంగానే ప్రజలు నేరాలకు దూరంగా ఉంటారు.

## ఒక కుటుంబ స్ఫూర్తి

ఈ భౌతిక ప్రపంచంలో మీకంటూ ఒక ముఖచిత్రాన్ని కలిగి ఉన్నారు. ఇక్కడ ప్రతి ఒక్కరు ఒక రహస్య ప్రణాళికను కలిగి ఉన్నారు, ఎప్పుడూ ఎవరో ఒకరి నుండి ఏదో ఒకటి, వారికి సైతం చెప్పకుండా ఆశిస్తూనే ఉంటారు. ఈ భౌతిక ప్రపంచంలో, పూర్తి నిస్వార్థ సంబంధాన్ని కలిగి ఉండటం సాధ్యం కాదు.

కానీ ఇంతటి కఠోర పరిస్థితుల్లో కూడా నిస్వార్థ సంబంధాలను పెంపొందించుకోవడానికి ఒక మార్గాన్ని అందించే తత్వ విజ్ఞానం మన చెంత ఉంది. ఆ తత్వ శాస్త్ర విజ్ఞానం మన చెంత ఉన్నంత కాలం, పరస్పరం ఒకరి పై ఒకరం ఆధారపడుతూ, మన మధ్య నిజమైన సంబంధాలను ఏర్పరుచుకోవడం సాధ్యమవుతుంది. వైష్ణవులకు సేవ చేయడం

అంటే వైష్ణవులకు అంకితమివ్వడం. మనం వైష్ణవులకు కావలసిన సౌకర్యాలను కల్పించాలి, వారికి ఇష్టమైన పని చేయడానికి కావలసిన వసతులను ఏర్పాటు చెయ్యాలి. వైష్ణవులను అభినందించాలి.

స్నేహ బంధంలో, మనం ఒకరి వద్దకు వెళ్లి, "హలో! ఏమి చేస్తున్నారు?" అంటూ పలకరించాలి. కొన్నిసార్లు ఎవరైనా అపరిచితుడు అలా పలకరించినా అది మనకొక మంచి భావనను కలిగిస్తుంది.

నా సొంత జీవితంలో నేను ఏమి చేసినా కలిసి రాని దశ ఒకటి ఉండింది. అప్పుడే ఎక్కడి నుంచో ఒక అపరిచితుడు వచ్చి, "నీ జీవితంతో నీవు ఏం చేద్దామనుకుంటున్నావు?" అన్నాడు. అతను అపరిచితుడు కాబట్టి నేను ఆశ్చర్యపో-యాను!

అప్పుడు నేను, "కానీ నేనెవరో కూడా మీకు తెలియదే!" అన్నాను.

అతను దానిని పట్టించుకోకుండా, "మీ జీవితంతో మీరు ఏమి చేస్తున్నారు!?" అన్నాడు మళ్ళీ!

ఒక అపరిచితుడు అంతగా శ్రద్ధ వహించడం నన్ను నిజంగా ఆశ్చర్యానికి గురి చేసింది! ఇది నా జీవితం పై బలమైన ప్రభావం చూపింది. ఆ పై నా జీవితంలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. అందువల్ల, యెస్, మనం ఒకరి పట్ల ఒకరం శ్రద్ధ వహించే తీరాలి.

మనమందరం కృష్ణుడిని సర్వోన్నత దేవదేవునిగా అంగీకరించినందున, కాలక్రమేణా ఆయనే మనల్ని ఒకచోటకు చేరుస్తాడు - గుళ్లలో మరియు పండుగల్లో మనం కలిసిపోతూ ఉంటాము - అలా కలిసినప్పుడు స్నేహ భావాన్ని అలవర్చుకుంటే అది మన బంధాలని మరింత ముందుకు తీసుకు వెళ్తుంది. ఎందుకంటే ఇక్కడ ఏర్పడే స్నేహం, నిజమైన స్నేహం, మనం కేవలం సహ భక్తులుగా ఉండటానికి మాత్రమే పరిమితం కాకుండా, ఒకరినొకరం ఉత్తే-జపరచబోతున్నాం!

ఒక సంస్థలో సహోద్యోగుల లాగా మనం కలిసి ఎలా ఉండగలమో అనే విషయమై, తరచూ నేనొక ఉదాహరణను ఇస్తూ ఉంటాను. మనమందరం కృష్ణుడి భక్తులం మరియు మనమందరం సహచరులం. మనమందరం ఒకే ఆల-యంలోని భక్తులం, హరే కృష్ణ అని జపిస్తూ, సంకీర్తనలలో సహచరులుగా నృత్యం చేస్తున్నాము. కానీ మన మధ్య స్నేహం లేనప్పుడు, ఇలా ఎన్ని చేసినా ప్రయోజనం ఉండదు.

నిజమైన స్నేహం అంటే కుటుంబ స్ఫూర్తిని కలిగి ఉండటం. మీ సహోద్యోగి బాగా పని చేయనప్పుడు, అది మీ పనికి కూడా భంగం కలిగిస్తుంది అప్పుడు మీరు ఇలా హెచ్చరిస్తారు, "కలిసి పని చేయండి! లేదంటే ఈ సంస్థ మిమ్మల్ని పనిలో నుండి తీసివేసి బయటకు పంపిస్తుంది" అని.

మీరు సహోద్యోగికైతే అలా చెప్తారు సరే - కానీ కుటుంబ సభ్యునితో మీరు చెప్పే తీరు ఎలా ఉంటుంది, "నువ్వు అసలు మాతో కలిసి కొంచెమైనా పని చేసే అవకాశం ఉందా, లేదా? ఎందుకని నీవు మాతో కలిసి సాగవు? అయినా మేము నిన్ను బయటకు పంపేయలేని పరిస్థితి. ఎందుకంటే నువ్వు కూడా ఈ కుటుంబంలో ఒక సభ్యునివి కనుక." అంటాం.

నిజమైన స్నేహమంటే అది. ఆ స్నేహంలో ఒక నమ్మకం ఉంది. ఆ స్నేహ బంధంలో మనం కొన్ని తప్పటడుగు-లు వేసినా మనం అంగీకరించబడతామని మనకు తెలుసు. మనము నటించాల్సిన అవసరం లేదు మరియు మనం

మరింత నిజాయితీగా ఉండాల్సిన అవసరం ఉంది. స్నేహం ఉన్నప్పుడు, మనం మనంగా ఉండవచ్చు ఇతరులచే అంగీకరించబడవచ్చు. ఆ విధంగా, మనకు అవసరమైన నిజమైన మానవీయ మద్దతును పొందగలము!

కవి-కర్ణపూర తన చైతన్య-చంద్రోదయ-నాటకంలో స్నేహాన్ని గురించి ఇలా వివరించారు. స్నేహం ఫరిఢవిల్లడానికి కొన్ని షరతులను పాటించాల్సిన అవసరం ఉంటుంది.

ముందుగా, ఒకరు భగవంతుని దయకు పాత్రులై ఉండాలి, ఆ దయ చేతనే ఒకరు ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పొందగలరు,

*"కృష్ణ-ప్రసాదే పాయ - భక్తి లతా బీజ (చైతన్య చరితామృత - మధ్య లీల 19.151)"*

మీరు వైష్ణవులతో సన్నిహితంగా ఉండాలి; వారే లేకపోతే అసలు స్నేహమనేది ఎక్కడుంటుంది!?

భౌతిక స్నేహం ఎల్లప్పుడూ ఏదో ఒక భౌతిక ఉద్దేశ్యంతో, కొంత స్వార్థంతో మిళితమై ఉంటుంది, కాబట్టి నిజమైన స్నేహం భగవంతుని దయను పొందడం పైనే ఆధారపడి ఉండాలి. మీరు భగవంతుని దయను పొందినప్పుడు, భక్తుల సహవాసం లోకి వస్తారు తద్వారా వారితో అనుబంధం అభివృద్ధి చెందుతుంది. ఆ సహవాసం ఫలాన మీరు క్రమంగా భక్తి మార్గమందు అభివృద్ధి చెందగలరు.

కవి-కర్ణపూర తదుపరి స్థాయి గురించి ఇలా వివరించారు. తదుపరి స్టేజి - స్నేహంలో ఆలోచనాత్మకత మరియు వివక్షను ఎదుర్కొను సహనాన్ని కలిగి ఉండుట. ఈ దశలో మీరు జీవితం యొక్క నిజమైన అర్థాన్ని శోధించడం ప్రారంభిస్తారు. ఒక వ్యక్తిగా మీరు పరిపక్వం చెందుతారు, ఆగ్రహావేశాలతో స్పందించరు. మరింత ఆలోచనాత్మకంగా మరియు లోతైన మార్గంలో ప్రతిస్పందిస్తారు. అప్పుడు మీరు అసూయ లేని ఒక ఉన్నత దశకి చేరుకుంటారు.

భక్తుల సహవాసంలో ఈ ఆలోచనాశక్తి మరియు వివక్షలకు సంబంధించి బలంగా మారిన తర్వాత, మీరు సమస్థితిని పొందుతారు - ఇది సమతుల్యతతో కూడిన మానసిక స్థితి. ఆ స్థితిలో, మీరు అసూయ పడకూడదని గ్రహిస్తారు. కవి కర్ణపూర చెప్తారు. ఈ స్థితికి చేరిన తర్వాతనే మీరు ఇతరులకు నిజమైన స్నేహితుడిగా ఉండగలరు. వాస్తవ స్నేహం అనేది కేవలం అప్పుడు మాత్రమే సాధ్యపడుతుంది!

ఈ విధంగా కవి-కర్ణపూర స్నేహానికి సంబంధించి ఒక ఆసక్తికర నిర్వచనాన్ని ఇచ్చి ఉన్నారు. ఈ షరతులు అధిగమిస్తేనే ఒకరు నిజమైన స్నేహానికి పాత్రులు అవ్వగలరు. ఆ షరతులకు లోబడే మన స్నేహ బంధాలు నిలుస్తాయి.

మానవ సంబంధాలకు సహాయపడే మరొక ముఖ్యమైన లక్షణం క్షమాగుణం. ఈ ప్రపంచంలో, ప్రతి సంబంధం దాని తోనే ప్రారంభం కావాలి, ఎందుకంటే, పూర్తి స్వచ్ఛంగా ఉండటం ఎవరికీ సాధ్యమవ్వదు. మనమందరం పరిపూర్ణంగా పవిత్రంగా ఉండి ఉంటే, మనకు ఎటువంటి లోపాలు ఉండేవి కావు, కానీ మనలో కూడా లోపాలున్నందున, మన సంబంధాలలో ఖచ్చితంగా క్షమించే స్ఫూర్తి ఉండాలి.

మనమనాలి, "సరే, మీలో కొన్ని లోపాలున్నాయి అయినా నేను వాటిని అంగీకరిస్తాను. మనం కలిసి వాటిని సరి చేయడానికి ప్రయత్నిద్దాము. నీ తప్పుని చూపించి నేను నిన్ను తక్కువ చేయను లేదా నిన్ను విమర్శించను. అవి అంత పెద్ద తప్పులు కావు గనక మనం వాటిని అతిగా ప్రస్తావించాల్సిన అవసరం కూడా లేదు. కానీ నువ్వు పెద్ద తప్పులు చేస్తే మాత్రం వాటిని సరిచేసుకునే తీరాలి.

# నా ప్రత్యేక అభ్యర్థన

మనం ఆధ్యాత్మిక గురువు సన్నిధిలో ఉన్నప్పుడు రెండు అంశాలు ఉంటాయి. ఒకటి మనం ఆధ్యాత్మిక గురువుకు సమర్పించేది మరియు రెండవది ఆధ్యాత్మిక గురువు నుండి మనం ఏం స్వీకరిస్తున్నాం అనేది. మనం సాధారణంగా గురువు నుంచి స్వీకరించే దశలోనే ఉంటాము, కానీ ఆధ్యాత్మిక గురువు అదృశ్యమైన తర్వాత, మన గురు శిష్య సంబంధం యొక్క ప్రధానాంశం - మనల్ని మనం ఆధ్యాత్మిక గురువుకు సమర్పించుకోవాలి. ఇవ్వడం అలవాటు చేసుకోవాలి, ఆ విధంగా మనం తిరిగి బలంగా అనుసంధానం అవ్వాలి. అప్పుడు ఆ బంధం వాస్తవంగా ప్రాణం పోసుకున్నట్లు అర్థం.

మీకు నా విజ్ఞపన ఏమిటంటే - ఈ అమోఘమైన కృష్ణ చైతన్య ఉద్యమాన్ని విశ్వవ్యాప్తం చేసే ఈ గొప్ప ప్రయత్నాన్ని దయచేసి కొనసాగించమని. ఈ ఉద్యమంలో నాకు సహాయం చేయండి, సాధారణ వ్యక్తులను వైష్ణవులుగా మార్చ-టానికి, మనుషుల్లోని మానవత్వాన్ని వ్యక్తీకరించడానికి మరియు ఆధ్యాత్మిక నియమాలను విధేయతతో ఆచరిం-చటానికి కావలసిన పరిసరాలను, సమాజాన్ని ఈ ఉద్యమం సృష్టిస్తుంది. నేను ఇక్కడ ఉన్నా లేకపోయినా నాకు సహాయం చేయండి. మీరు అలా చేస్తే నేను ఎప్పటికీ మీకు తోడై ఉంటాను.

ఈ ప్రస్తుత జీవిత కాలంలోనే భగవద్ధామానికి తిరిగి వెళ్ళాలి అన్నది ఒకటే మన ఆలోచన అవ్వాలి. స్వతహాగా ఆధ్యా-త్మికంగా దృఢంగా ఉన్నవారు, దయచేసి ఇతరులను తీసుకెళ్లండి. స్వతహాగా బలహీనంగా ఉన్నవారు, దయచేసి ధృడమైన భక్తులను ఆశ్రయించండి. ఎలాగైనా సమిష్టిగా సహాయం చేసుకోండి. ఎవ్వరూ అన్ని సమయాలలో బలంగా ఉండజాలరు, కానీ కొందరు సహజ సిద్ధంగా ఆధ్యాత్మికంగా బలంగా ఉంటారు మరియు వారు ఇతరులను నడిపించడానికి మరియు ఇతరులు ఈ గొప్ప వైష్ణవులను అనుసరించడానికి ఉద్దేశింపబడ్డారు. మనమందరం మన పాత్రలను పోషిస్తున్నాము. నా ఆధ్యాత్మిక గురువు నాకు ఈ ఆధ్యాత్మిక నాయకత్వ పాత్రను అప్పజెప్పారు. నేను ఆ ఆజ్ఞను స్వీకరించడానికి మరియు దానినే నా జీవిత పరమావధిగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాను. మీరు కూడా మీ వంతు పాత్ర పోషించాలి. ఈ క్రమశిక్షణ వారసత్వం ద్వారా ఎలాంటి అద్భుతమైన అమూల్యమైన అవ-కాశాలు అందజేయబడుతున్నాయో దయచేసి గ్రహించండి. అన్ని విధాలుగా ప్రయత్నం చేసి చూద్దాం.

# శ్రీల కదంబ కానన స్వామి గురించి

శ్రీల కదంబ కానన స్వామి వారు అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) యందు ప్రఖ్యాతి గాంచిన ఆధ్యాత్మిక నాయకులు మరియు దీక్షా గురువు. నెదర్లాండ్స్ దేశ రాజధాని అగు ఆమ్స్టర్డామ్ నగరానికి సమీపంలోని హీమ్స్టెడ్ అనే చిన్న పట్టణంలో జన్మించిన వారు, సంపన్న వాణిజ్య కుటుంబానికి చెందిన వారు. ప్రపంచం పట్ల అనాసక్తులై వారు సత్యాన్వేషణలో పడి, వారి సాధారణ జీవన మార్గాన్ని వదిలిపెట్టారు.1970 దశకం చివర్లో, వారు ఇస్కాన్ వ్యవస్థాపక ఆచార్యులైనట్టి శ్రీల ప్రభుపాదుల బోధనల పట్ల ఆకర్షితులయ్యారు. ఆ పై శ్రీకృష్ణ భగవానుని సేవకు వారి జీవితాన్ని అంకితం చేస్తూ సంస్థలో శాశ్వత సభ్యుడిగా చేరిపోయారు.

వారు 1978లో, ఇస్కాన్ వృందావన్ ఆలయానికి చేరుకున్నారు. ఆ పై అనేక సంవత్సరాలు వారు పవిత్ర భూమి అయిన బృందావనంలోనే నివసించారు. ఇస్కాన్ ఉద్యమంలో వివిధ కార్య నిర్వాహక పదవులను నిర్వహిస్తూ, ఇస్కాన్ బృందావన్ = శ్రీ కృష్ణ బలరామ్ మందిరానికి 5 సంవత్సరాలు, 1990 నుండి 1995 వరకు అధ్యక్షుడిగా పని చేశారు. అయినప్పటికీ, వారి ప్రధాన అభిరుచి ఎల్లప్పుడూ కృష్ణుని ఉత్కృష్టమైన సందేశాన్ని బోధించడం, తద్వారా మానవాళికి శాంతి మరియు ఆనందాన్ని కలిగించడం పైనే ఉండేది.1997 లో, వారు, వారి ఆధ్యాత్మిక గురువైన శ్రీపాద జయద్వైత స్వామి నుండి సన్యాసం స్వీకరించారు.

గత నాలుగు దశాబ్దాలుగా, కదంబ కానన స్వామి ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు, భగవద్గీత మరియు వైష్ణవ సాధువుల బోధనలను ప్రజలతో పంచుకున్నారు. లెక్కలేనన్ని సెమినార్లు, ఉత్సవాలు మరియు పండుగలలో ప్రసంగించారు. ఆధ్యాత్మికత మరియు భక్తి-యోగ సాధన పై అనేక పుస్తకాలను రాశారు. వారు తమ ఆకర్షణీయమైన బోధనా శైలికి మరియు సంక్లిష్టమైన ఆధ్యాత్మిక భావనలను అన్ని నేపథ్యాల ప్రజలకు అర్థమయ్యేలా సరళంగా చెప్పడంలో దిట్ట.

వారి అమోఘ ఆధ్యాత్మిక స్పృహతో, వారి అనేక మంది శిష్యులతో వ్యక్తిగత సంబంధాన్ని పెంపొందించుకోవడానికి వారు ఆద్యంతం ప్రయత్నించారు, దయాగుణం, శ్రీల ప్రభుపాదుల పట్ల విశ్వసనీయత మరియు భక్తి పట్ల స్పృహతో కూడిన విధానాన్ని నొక్కి చెప్పారు. వారు ఒక వ్యక్తి జీవితాన్ని పరిశీలించి, వారి నేపథ్యం ఎంత భిన్నంగా ఉన్నా సరే లేదా ఎంత క్లిష్టమైనదైనా సరే, ఇస్కాన్‌లో వారు ఏ సేవలను చేయగలరో గుర్తించి వారికి సులభ మార్గం కల్పించి, అటువంటి ఎందరో భక్తుల జీవితాలను తీర్చిదిద్దిన మహనీయులు వారు. "నేను ప్రజలలో నా పెట్టుబడి పెట్టాను," అని వారు తరుచూ అనే వారు.

ఇస్కాన్ లో అతి కష్టతరమైన ప్రాజెక్టులను నిర్వర్తించుటకు ముందు గుర్తు వచ్చే వ్యక్తులలో ఒకరు - శ్రీల కదంబ కానన స్వామీ మహారాజ్. మాయాపూర్‌లో, వారు శ్రీల ప్రభుపాదుల పుష్ప సమాధి మందిర నిర్మాణానికి బాధ్యత వహించారు. దక్షిణాఫ్రికాలో, వారు ఆఫ్రికన్ విద్యార్థులతో సంబంధాలను ఏర్పరచుకోవడానికి మరియు వారి ఆధ్యాత్మిక వృద్ధికి సౌకర్యాన్ని అందించడానికి క్రింది స్థాయి నుంచి పనిచేశారు. ఈ సేవ 2007లో జరిగిన మొదటి సోవేటో రథయాత్రలో పరాకాష్టకు చేరుకుంది, దీనికి వారే స్ఫూర్తి, వారే వ్యూహరచన మరియు ఆర్థిక సహాయం చేశారు. శ్రీల ప్రభుపాదుల వారసత్వం ప్రారంభమైన న్యూయార్క్‌లోని బ్రూక్లిన్ ఆలయాన్ని తిరిగి తెరవడంలో కూడా వారు కీలక

పాత్ర పోషించారు. ప్రపంచం నలుమూలల నుండి శిష్యులను తీసుకురావడం ద్వారా సమయం, ఆర్థిక మరియు మానవ వనరులను అందించడం ద్వారా వారు సమాజానికి గొప్ప సేవ చేసి ఉన్నారు.

కదంబ కానన స్వామి ఒక గొప్ప మేనేజర్ మరియు ప్రచారకులు మాత్రమే కాదు, వారొక నిష్ణాతులైన సంగీత విద్వాంసులు కూడా. వారి లోతైన ఉపన్యాసాలతో పాటుగా, వారు గొప్ప ప్రశంసలు పొందిన గాయకులు, వారు ఉప్పొంగించే రాగాలకు, అలాగే కృష్ణ భగవానుని కీర్తించడంలో హృదయాలను కదిలించే వారి మధుర స్వరానికి ప్రసిద్ధి గాంచారు. వారు అనేక భక్తి ఆల్బమ్‌లను రికార్డ్ చేశారు, అవి వాటి ఉత్తేజకరమైన శ్రావ్యతకు మరియు లోతైన భక్తి భావన కలిగి ఉన్నవై ప్రశంసించబడ్డాయి. ప్రపంచవ్యాప్తంగా జరిగే ఎన్నో జగన్నాథ రథోత్సవాలు మరియు కీర్తన ఉత్సవాలకు వారి సంగీత నైపుణ్యం, రాగ మాధుర్యం జీవం పోసేది.

కాలక్రమేణా, కదంబ కానన స్వామి వారి ఆధ్యాత్మిక అభ్యాసాన్ని మరింత లోతుగా నిర్వర్తించారు. వారి జీవితాలకు గొప్ప అర్థాన్ని కనుగొనడానికి ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది ప్రజలను ప్రేరేపిస్తూ అలుపెరుగని సుదీర్ఘ ప్రయాణం చేశారు. అయితే, వారి జీవిత ప్రయాణ ముగింపు దశలో, వారికి ప్రాణాంతక క్యాన్సర్ ఉందని తెలిసి, పవిత్ర భూమి అయిన బృందావనానికి తిరిగి వచ్చారు, వారి అంతిమ గమ్యస్థానమైన గోలోక బృందావన ప్రయాణానికి సిద్ధమయ్యారు.

వారు మిక్కిలి ధైర్యవంతులు, హాస్యాన్ని పండించేవారు, ధీరులు మరియు అందరికీ అందుబాటులో ఉండేవారు. వారికి తెలిసిన ప్రతి ఒక్కరిని కృష్ణ భక్తి వైపు ప్రేరేపించడానికై తపించారు. వారి ప్రోత్సాహకరమైన ప్రవర్తన మరియు స్ఫూర్తిదాయకమైన విజయాలు వారిని  భక్తి యోగ ఆదర్శ అభ్యాసకులుగా చేశాయి, వారి అడుగుజాడలు ఎంతో మందికి ఆదర్శం, అనుసరణీయం.



ఆధ్యాత్మిక గురువు
యొక్క ప్రధాన కర్తవ్యం
శిష్యులలో స్వాభావికంగా
ఉండే స్వశక్తిని మించిన,
గొప్ప దార్శనికతను,
జ్ఞాన దృష్టినీ అందించడమే.

www.kksblog.com
www.kkswami.com